

డీఎస్సీపై అవాస్తవ ప్రచారం చేస్తున్న వైకాపా నేతలను బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరినా స్పందించలేదు. గంటకు పైగా వేచి చూసినా వైకాపా నేతలు ఎవరూ రాకపోవడంతో, వారి ఆరోపణల్లో వాస్తవం లేదని ప్రజలకు స్పష్టమైంది.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



సోమవారం 10.08.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్


తెలుగు దినపత్రిక

సంపుటి - 34 | సంచిక - 110 | www.journalistfile.com | పేజీలు 8 | వెల : రూ.5.00




# స్వర్ణాంధ్రే మనందరి సంకల్పం

- దేశ నిర్మాణంలో పౌరుల భాగస్వామ్యమే కీలకం
- పనిచేసే ప్రతి వ్యక్తీ సమాజానికి ఓ మంచి ఆస్తి
- 5 అంశాలతో ఆదివాసీల సమగ్రాభివృద్ధికి ప్రణాళిక
- అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవంలో సీఎం చంద్రబాబు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** దేశానికి, రాష్ట్రానికి విజన్ ఉన్నట్టే ప్రతీ పౌరుడికి ఓ విజన్ ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. దేశం, రాష్ట్రం, గ్రామం, కుటుంబం అభివృద్ధి కోసం అంతా సంకల్పం తీసుకోవాలని ఆయన అన్నారు. 2047 స్వర్ణాంధ్ర కోసం తాను సంకల్పం తీసుకున్నానని ముఖ్య మంత్రి అన్నారు. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయ వాడలోని అంబేద్కర్ కళావేదికలో నిర్వహించిన కార్యక్రమానికి సీఎం హాజరయ్యారు. గిరిజన సంప్రదాయ నృత్యం ధింసా, డప్పు, వివిధ వాయిద్యాలతో గిరిజన మహిళలు, మంత్రి సంధ్యారాణి, ఇతర ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు. ధింసా నృత్యం చేస్తున్న మహిళలతో ఆయన కూడా అడుగులు వేశారు. స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి ముఖ్యమంత్రి నివాళులు అర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... “ ప్రకృతిని ఆరాధిస్తూ, సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకుంటూ గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు చేయగల సామర్థ్యం ఆదివాసీలకు ఉంది. ఓ సామాన్య ఆదివాసీ మహిళ ద్రౌపదీ ముర్ము ఒడిశాలో మంత్రిగా, గవర్నర్ గా పనిచేసి నేడు రాష్ట్రపతిగా అత్యున్నత స్థానంలో ఉన్నారు. మన సంకల్పమే మనకు ఆత్మవిశ్వాసం కల్పించి అందలాలు ఎక్కిస్తుంది. అబ్దుల్ కలాం, ఎన్టీఆర్, ప్రధాని మోదీ ఇలా ప్రతి ఒక్కరూ సామాన్య కుటుంబం నుంచి వచ్చిన వారే. సంకల్పం ఒక్కటే మార్పు తెస్తుందని అంతా గుర్తించాలి. దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేలా అంతా సంకల్పం తీసుకోవాలి. నేను, నా దేశం, నా రాష్ట్రం, నా ఊరు నా కుటుంబం అనే భావనతో సంకల్పం చేస్తేనే అభివృద్ధి సాధించగలం. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సమాజానికి, దేశానికి నేను ఏమివ్వాలనే లక్ష్యంతో పనిచేద్దాం. గిరిజన రైతులు తన పంటను మెరుగ్గా పండించి దేశం కోసం కృషి చేశారు. స్వయం ఉపాధితో సంపాదిస్తున్న మహిళ దేశం కోసం పనిచేసినట్టే. ఓ విద్యార్థి, ఓ ఉద్యోగి, ఓ వ్యాపారి, ఓ కూలి ఇలా ఎవరైనా నిష్టతో అత్యుత్తమ సామర్థ్యంతో పనిచేస్తే దేశ కోసం పనిచేసినట్టే. సమాజానికి ఏమిచ్చాం, దేశానికి ఏం చేశాం అన్నదే లక్ష్యంగా పనిచేయాలి. ఒకరు ప్రకృతి కోసం, మరొకరు పర్యావరణం కోసం, ఇంకోకరు నీటి సంరక్షణ కోసం పనిచేయాలి. రాష్ట్రానికి, దేశానికి విజన్ ఉన్నట్టే వ్యక్తిగతం గానూ ప్రతి ఒక్కరికీ ఓ విజన్ ఉండాలి. వికసిత్ భారత్ విజన్ ను ప్రధాని మోదీ చేస్తే, నేను 2047 స్వర్ణాంధ్ర విజన్

2 లో..



డెల్టాకు గోదావరి

## జలధార



- పట్టిసీమ ద్వారా 17.52 టీఎంసీల నీటి తరలింపు..
- ప్రకాశం బ్యారేజ్‌ను పరిశీలించిన సీఎం చంద్రబాబు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రకాశం బ్యారేజ్ లో గోదారమ్మ నీటి పరవళ్లను ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశీలించారు. పట్టి సీమ ద్వారా కృష్ణమ్మకు వస్తున్న గోదావరి నీటిని ముఖ్యమంత్రి తిలకించారు. విజయవాడలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో పాల్గొని తిరిగి నివాసానికి వెళు తున్న సమయంలో బ్యారేజ్ పై కొద్దిసేపు తన వాహన కాన్వాయ్ నిలిపిన ముఖ్యమంత్రి గోదావరి నీటితో నిండు కుండలా ఉన్న బ్యారేజ్ ను పరిశీలించారు. గోదావరి నీటితో బ్యారేజ్ నిండుగా ఎంతో ఆహ్లాదంగా కనిపిస్తోందని సీఎం ఈ సందర్భంగా అన్నారు. పట్టిసీమ ద్వారా ఈ సీజన్ లో ఇప్పటి వరకు

మిగతా 2లో...



## గిరిజనుల సంక్షేమానికి పెద్దపీట

- సమస్యల పరిష్కారానికి రూ.30 కోట్లతో చర్యలు
- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** గిరిజనుల విద్య, వసతిగృహాలు, సంక్షేమం, మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు అందుబాటులో ఉన్న రూ. 30 కోట్ల నిధులతో చర్యలు చేపడతామని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లోని శంకరన్ మినీ హాల్లో ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

**ఆదివాసీ పోరాట యోధులను స్మరించుకోవాలి :** ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉందని పెమ్మసాని పేర్కొన్నారు. దేశం, స్వాభిమానం కోసం ప్రాణత్యాగం చేసిన ఆదివాసీ నాయకులను ఈ సందర్భంగా స్మరించుకోవాలన్నారు. గిరిజనుల హక్కుల కోసం పోరాడిన బీర్సా ముండా, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వంటి పోరాట యోధుల త్యాగాలను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

**గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి :** గిరిజన ప్రాంతాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేక దృష్టి సారించారని పెమ్మసాని తెలిపారు. జన్‌మన్ పథకం ద్వారా మారుమూల గిరిజన ప్రాంతాలకు రహదారులు,

మిగతా 2లో...



## బహిరంగ చర్చకు సవాల్ చేస్తే తోకముడిచారు


**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** డీఎస్సీపై అనవసర, అవాస్తవ ప్రచారం చేస్తున్న వైకాపా నాయకులను బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరితే.. చర్చకు రాకుండా తోకముడిచారని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ విమర్శించారు. డీఎస్సీ నియామక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించినప్పటికీ వైకాపా అధ్యక్షుడు జగన్‌తో పాటు ఆ పార్టీ నాయకులు నానా యాగీ చేస్తున్నారని మండిపడ్డారు. శనివారం ఉదయం గుంటూరు లాడ్జి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద బహిరంగ చర్చకు రావాలని తాను సవాల్ విసిరానని, గంటకు పైగా అక్కడ వేచి చూసినా వైకాపా నేతలు ఎవరూ రాలేదని తెలిపారు.
డీఎస్సీ నియామకాలపై వైకాపా చేస్తున్న ఆరోపణలకు ఆధారాలుంటే బహిరంగ చర్చకు తీసుకురావాలని ఆలపాటి అన్నారు. వైకాపా నుంచి ఒకరు, టీడీపీ నుంచి తాను మాత్రమే చర్చకు కూర్చుందామని గతంలోనే ప్రకటించినట్లు తెలిపారు. డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియను ఎక్కడా జాప్యం లేకుండా, అత్యంత పారదర్శకంగా పూర్తి చేశామని పేర్కొన్నారు. నియామకాలకు సంబంధించి కోర్టుల్లో దాఖలైన సుమారు 355 పిటిషన్లను న్యాయపరంగా ఎదుర్కొని విజయం సాధించామని చెప్పారు.

మిగతా 3లో...

- డీఎస్సీపై వైకాపా అవాస్తవ ప్రచారం
- చర్చకు రమ్మంటే ముఖం చాటేశారు
- అత్యంత పారదర్శకంగా 16,347 పోస్టుల భర్తీ
- 355 పిటిషన్లను న్యాయపరంగా ఎదుర్కొని విజయం
- వైకాపా హయాంలో ఒక్క జాబ్ క్యాలెండర్ కూడా ఇవ్వలేదు

ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

## అండర్-20 అథ్లెటిక్స్‌లో భారత్ జోరు




- హైజంప్‌లో బసంత్‌కు చారిత్రక రజతం..
- లాంగ్‌జంప్‌లో షానవాజ్‌కు తొలి కాంస్యం

**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రపంచ అథ్లెటిక్స్ అండర్-20 ఛాంపియన్‌షిప్‌లో భారత అథ్లెట్లు సత్తా చాటుతున్నారు. శనివారం జావెలిన్ త్రోలో ఆశిష్ యాదవ్ రజత పతకం సాధించగా.. తాజాగా మరో రెండు పతకాలు భారత్ ఖాతాలో చేరాయి. పురుషుల హైజంప్‌లో బసంత్ కుమార్ మేఘ్వాల్ రజత పతకం సాధించాడు. దీంతో అండర్-20 ప్రపంచ ఛాంపియన్‌షిప్ చరిత్రలో పురుషుల హైజంప్‌లో

## మెడికో ప్రియాంక కన్నుమూత

- కిమ్స్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస
- నిందితులకు కఠిన శిక్షలు పడేలా చూస్తామన్న సీఎం



**సికింద్రాబాద్ (జర్నలిస్ట్ ఫైల్) :** రాజమహేంద్రవరం ఘటనలో తీవ్రంగా గాయపడిన వైద్య విద్యార్థిని ప్రియాంక మృతిచెందారు. చికిత్స పొందుతూ ఆమె మృతిచెందినట్లు సికింద్రాబాద్ కిమ్స్ వైద్యులు ధ్రువీకరించారు. ఆదివారం మధ్యాహ్నం 3.25 గంటలకు ప్రియాంక తుదిశ్వాస విడిచినట్లు వెల్లడించారు. కిమ్స్‌లో ఉన్న ప్రియాంక మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించనున్నారు.

2లో...

## రష్యా నుంచి భారత్‌కు రైలు మార్గం!

- హోర్ముజ్, బొస్ఫోరస్‌పై ఆధారపడటాన్ని తగ్గించే యత్నం
- మధ్య, దక్షిణాసియా మీదుగా ప్రత్యామ్నాయ కారిడార్‌పై ప్రతిపాదన
- రష్యా ఉప ప్రధాని మరట్ ఖుస్నులిన్ వెల్లడి



**మాస్కో, :** హోర్ముజ్ జలసంధి, టర్కీలోని బొస్ఫోరస్ జలసంధులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు రష్యా ప్రత్యామ్నాయ రవాణా మార్గాలపై దృష్టిసారించింది.

మిగతా 2లో...

## ట్రావెల్స్ బస్సును ఢీకొట్టిన ఐషర్



- బ్రిడ్జిపై నుంచి పడిపోయిన రెండు వాహనాలు
- బస్సులో 20 మందికి తీవ్ర గాయాలు
- పలువురి పరిస్థితి విషమం
- క్యాబిన్లలో చిక్కుకున్న డ్రైవర్లను రక్షించిన స్థానికులు

**అనంతపురం (జర్నలిస్ట్ ఫైల్) :** అనంతపురం జిల్లా పామిడి మండలం పొగురూరు సమీపంలోని జాతీయ రహదారిపై ఉన్న బ్రిడ్జిపై ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును ఐషర్ వాహనం ఆదివారం తెల్ల వారుజామున ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు రెండు వాహనాలు బ్రిడ్జిపై నుంచి కిందపడిపోయాయి.

మిగతా 2లో...

## గిరిజనుల ఆత్మగౌరవానికి అండగా కూటమి

- సంక్షేమం, విద్య, వైద్యం, ఉపాధికి పెద్దపీట
- రద్దయిన 18 పథకాల పునరుద్ధరణ: మంత్రి సంధ్యారాణి



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ డా. బి ఆర్ అంబేద్కర్ కళా వేదికలో ఆదివారం గిరిజన సంక్షేమ శాఖ నిర్వహించిన కార్యక్రమంలో లిగిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ..లి గిరిజనులు ఆత్మగౌరవంతో జీవించేలా వారి సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆదివాసీ దినోత్సవాన్ని ఒక పండుగలా నిర్వహిస్తున్నామని తెలిపారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతి కల్పించేందుకు బెస్ట్ అవైలబుల్ స్కూళ్లు, కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్సీలు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు.
సుమారు రెండు లక్షల మంది గిరిజన విద్యార్థులకు వసతి గృహాల ద్వారా ఉచిత విద్య అందిస్తున్నామని,

మిగతా 2లో...

# స్వర్ణాంధ్రే మనందరి సంకల్పం

(మొదటి పేజీ తరువాయి)

రూపకల్పన చేశాను. జాతీయ జెండా స్ఫూర్తితో కలసికట్టుగా ముందుకు అడుగేద్దాం. వ్యక్తిగతంగా విజయం సాధించటమూ నేషన్ బిల్డింగ్ లో భాగమే. పనిచేసే ప్రతీ వ్యక్తీ సమాజానికి ఆస్తి. సమాజం కోసం పనిచేయటమే గొప్ప దేశభక్తి, అందరి గెలుపే దేశం గెలుపు." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**అరకు కాఫీని గ్లోబల్ బ్రాండ్ గా మారుస్తాం :** "భోగాపురంలోని అంతర్జాతీయ విమానాశ్రయానికి మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాం. విమానాశ్రయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో గిరిజన బిడ్డలు ధింసా నృత్యం ఇప్పుడు గిన్నీస్ బుక్ రికార్డు సాధించింది. ఈ రికార్డు సాధించి మన సంస్కృతీ సంప్రదాయాన్ని ప్రపంచానికి చాటి చెప్పారు. పోడు వ్యవసాయం కాదు ఆర్గానిక్ వ్యవసాయంతో గిరిజనులు విలువైన పంటల్ని ఉత్పత్తి చేస్తున్నారు. రాష్ట్రంలోని 27.39 లక్షల మంది గిరిజనుల సమగ్రాభివృద్ధికి రూ.4764 కోట్లను కేటాయించాం. ఐటీడీఏలతో గిరిజన అభివృద్ధి కోసం జీవన ప్రమాణాలు పెంచడానికి ప్రత్యేకంగా దృష్టి సారించాం. మౌలిక వసతుల కల్పన, ఉపాధి, ఉద్యోగాలు, నైపుణ్య కల్పనపై ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టాం. 2336 గిరిజన ఆవాసాలకు మిషన్ మోడ్ లో రోడ్డు కనెక్టివిటీ కల్పిస్తున్నాం. 2027 నాటికి ప్రతీ గిరిజన కుటుంబానికీ సురక్షితమైన తాగునీరు, ఆవాసం కల్పిస్తాం, సోలార్ రూఫ్ టాప్ కూడా ఏర్పాటు చేస్తాం. అడవి తల్లి బాట పేరుతో వెయ్యి కోట్లతో 905 కిలోమీటర్ల రోడ్లు వేశాం. డోలీ మోతలు లేకుండా ఫీడర్ అంబులెన్సులు, 108,104 మొబైల్ మెడికల్ యూనిట్లు ఏర్పాటు చేశాం. అలాగే డిజిటల్ కనెక్టివిటీ కోసం సెల్ టవర్లు ఏర్పాటు చేస్తున్నాం. 25 ఏళ్ల క్రితమే అ-రకు కాఫీకి నాంది పలికాం, ఇప్పుడు ప్రపంచ బ్రాండ్ గా



అరకు కాఫీ ఎదిగింది. మరో లక్ష ఎకరాల్లో కాఫీ సాగు చేసేలా ప్రోత్సహిస్తున్నాం. కాఫీ, మిరియాలు, పసుపు లాంటి వాణిజ్య పంటలకు బ్రాండ్ గా ఏజెన్సీ ప్రాంతం మారాలి. ప్రధాని మోదీ కూడా ఆస్ట్రేలియా ప్రధానికి అరకు కాఫీనే బహుమతిగా ఇచ్చి ప్రమోట్ చేస్తున్నారు. రాష్ట్రానికి వచ్చిన ప్రతీ అతిథికి అరకు కాఫీని బహుమతిగా ఇస్తూ ప్రోత్సాహం కల్పిస్తున్నాం పార్లమెంటు లోనూ అరకు కాఫీ స్టాల్ ఏర్పాటు చేయించాం. బెస్ట్ గ్లోబల్ బ్రాండ్ గా దీనిని మారుస్తాం. గిరిజన ప్రాంతాల్లోని అటవీ ఉత్పత్తులకు విలువ జోడించటం ద్వారా మంచి మార్కెటింగ్ కల్పిస్తాం. సీతంపేట పసుపు, రంపచోడవరం రబ్బర్, పార్వతీపురం పైనా పిల్, తేనె, తాటి బెల్లం ఇలా ఉత్పత్తి నుంచి ప్రాసెసింగ్ , బ్రాండింగ్ వరకూ ప్రభుత్వం అండగా ఉంటుంది."అని ముఖ్యమంత్రి వివరించారు.

**ఆదివాసీల సమగ్రాభివృద్ధికి కార్యాచరణ :** "రహదారులు, సురక్షితమైన తాగునీరు లాంటి మౌలిక వసతులు, విద్య, వైద్యంవైద్యం, ఆదాయ వనరుల పెంపు, నైపుణ్య శిక్షణ లాంటి ఐదు అంశాల్లో ఆదివాసీల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నాం. ఒక్క ఆదివాసీల కోసమే 3 ప్రత్యేక జిల్లాలు ఏర్పాటు చేసి వారికి ప్రాధాన్యత కల్పించాం. ఎటు చూసినా పచ్చదనం కలిగిన ఈ ప్రాంతాల్లో పర్యాటకాన్ని కూడా గణనీయంగా ప్రోత్సహిస్తాం. నేడు చేసుకున్న 19 ఎంఓయూల ద్వారా 60 వేల మందికి లబ్ధి కలుగుతుంది. గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా 1.5 లక్షల మందికి నైపుణ్య శిక్షణ అందిస్తాం. ఐఐటీ, నీట్ లాంటి పోటీ పరీక్షలకు కూడా వారిని సిద్ధం చేసి అందరితో పోటీ పడేలా ప్రోత్సహిస్తాం. జీవో నెంబరు 3 ద్వారా గిరిజన ప్రాంతాల్లో స్థానికులకే ఉద్యోగాలు దక్కేలా చేశాం. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఈ జీవోను కొట్టివేశారు. ప్రత్యామ్నాయం గురించి ఆలోచన చేస్తున్నాం. ఆదివాసీల హక్కులు కాపాడేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది. నాణ్యమైన వైద్య సేవలు అందేలా రూ.250 కోట్లతో పార్వతీపురం, సీతంపేట, రంపచోడవరం, చింతూరు, కేఆర్ పురం, శ్రీశైలం లాంటి ప్రాంతాల్లో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు నిర్మాణం పూర్తి చేస్తార్". అని సీఎం వివరించారు.

**స్వర్ణాంధ్ర కోసం కలిసి పని చేద్దాం:** "2047 నాటికి స్వర్ణాంధ్ర ప్రదేశ్ సాధన కోసం మనం అంతా పనిచేయాలి. ఆర్థిక అసమానతలు తగ్గి అందరికీ మెరుగైన జీవన ప్రమాణాలు అందేలా ప్రణాళికలు చేశాం. సూపర్ సిక్స్ తో పాటు వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాం. పీ4 తో పాటు వివిధ కార్యక్రమాల ద్వారా పేదల్ని ఆదుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. ప్రభుత్వం అందిస్తున్న పౌర సేవలు ఎలా అందుతున్నాయో తెలుసుకునేందుకు ప్రజల నుంచి ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నాం. చంద్రబాబు అనే నేను ప్రజల జీవితాలను మార్చి, మెరుగైన జీవన ప్రమాణాలు కల్పిస్తే లక్ష్యం నెరవేరినట్టే. దేశం, రాష్ట్ర అభివృద్ధిలో ప్రతీ పౌరుడూ భాగస్వామి కావాలి. విద్యార్థులకు ఇది అలవాటు చేసేలా ఓ మొక్కను నాటి సంరక్షించేలా గ్రీన్ పాస్ పోర్టు కార్యక్రమం తెచ్చాం. మన పర్యావరణం కోసం మొక్కలు నాటటంతో పాటు వాటిని సంరక్షించటం కూడా మన బాధ్యత. 80 స్వతంత్ర దినోత్సవం లోగా ప్రతీ పౌరుడూ ఓ సంకల్పం తీసుకోవాలని నేను విజ్ఞప్తి చేస్తున్నా. వచ్చే 21 ఏళ్లలో దేశం, రాష్ట్రం అభివృద్ధికి చిరునామాగా మారతాయి." అని సీఎం అన్నారు.

అనంతరం అంబేద్కర్ కళావేదిక వద్ద ఏర్పాటు చేసిన గిరిజన ఉత్పత్తుల స్టాళ్లను సీఎం పరిశీలించారు. పాడేరు, రంపచోడవరం, నల్లమల, అరకు, చింతపల్లి, పార్వతీపురం మన్యం తదితర ప్రాంతాల నుంచి ఉత్పత్తులు తయారు చేసి ప్రదర్శించిన గిరిజన మహిళల్ని సీఎం అభినందించారు. గిరిజన ప్రాంతాల్లో తయారు చేస్తున్న ఉత్పత్తులకు బ్రాండ్ రూపొందించి మార్కెటింగ్ చేయాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

## గిరిజనుల సంక్షేమానికి పెద్దపీట



(మొదటి పేజీ తరువాయి)

జల్‌జీవన్ మిషన్ ద్వారా తాగునీటి సౌకర్యాలు కల్పించేందుకు ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారని చెప్పారు. అరకులో పండే కాఫీకి దేశవ్యాప్తంగా మార్కెట్ కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారని తెలిపారు.

**625 గ్రామాలకు రోడ్లు.. రెండో దశలో రూ.1,120 కోట్లు:** డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో తొలి దశలో సుమారు 625 గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించామని పెమ్మసాని తెలిపారు. రెండో దశలో రూ.1,120 కోట్లతో రోడ్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. గిరిజనులు కోరిన రేషన్ కార్డులు, ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాలు, గిరిజన్ భవన్ తదితర సౌకర్యాలను వీలైనంత త్వరగా కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

**గిరిజనుల సమస్యలపై కలెక్టర్‌తో కలిసి కృషి :** గిరిజనులకు అవసరమైన విద్య, వసతిగృహాలు, సంక్షేమ హాస్టళ్లలో సౌకర్యాలపై పూర్తి అవగాహన ఉందని పెమ్మసాని తెలిపారు. ఆయా సమస్యల పరిష్కారానికి తాను, జిల్లా కలెక్టర్ పూర్తిగా నిమగ్నమై పనిచేస్తున్నామని చెప్పారు. గుంటూరు జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు జీజీహెచ్‌లో వందల కోట్ల రూపాయలతో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

**గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు :** నగరాల తరహాలో గ్రామాలు కూడా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో వీఈజీ--రామ్‌జీ పథకం ద్వారా సకల సౌకర్యాలు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నామని పెమ్మసాని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను పరిష్కరించే సామర్థ్యం, పనిచేసే తత్వం ఉన్న నాయకులను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు.

**ఆదివాసీ సంస్కృతి, హక్కులను కాపాడాలి:** గల్లా మాధవి మాట్లాడుతూ గిరిపుత్రులు, సంస్కృతి, సంప్రదాయాలకు వారసులైన ఆదివాసీ ప్రజలకు ప్రపంచ ఆదివాసీ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అడవి బిడ్డల హక్కులు, సంప్రదాయాలను పరిరక్షించాలనే ఉద్దేశంతో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఆదివాసీలు అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.

**నీరు, భూమి, అడవితో ఆదివాసీల అనుబంధం :** ఎంపీ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ నీరు, భూమి, అడవిని నమ్ముకుని ఆదివాసీ సమాజం జీవిస్తోందన్నారు. వారి సంప్రదాయాలు నేటికీ కొనసాగుతున్నాయంటే వారు పాటిస్తున్న జీవన విధానాలే కారణమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గిరిజనుల సమస్యలను గుర్తించి పరిష్కరిస్తున్నారని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో వికసిత్ భారత్–2047 లక్ష్యం దిశగా దేశం ముందుకు సాగుతోందన్నారు.

కార్యక్రమంలో గిరిజన నాయకులు శ్రీను నాయక్, మేడా రామకృష్ణ, బాపట్ల ఏసుబాబు, చంద్రనాయక్, కట్ట వెంకటేశ్వర్లు, కే.కోటయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వందనాల దేవి, టీడీపీ నాయకుడు తాళ్ల వెంకటేష్ యాదవ్, గిరిజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## డెల్టాకు గోదావరి జలధార



(మొదటి పేజీ తరువాయి)

17.52 టిఎంసిల నీటిని కృష్ణా నదికి తరలించినట్లు అధికారులు వివరించారు. ఎగువ నుంచి వస్తున్న ప్రవాహాల కారణంగా గోదావరి నది నుంచి ఇప్పటి వరకు 521 టీఎంసీల నీరు సముద్రంలో కలిసినట్లు అధికారులు తెలిపారు. పట్టి సీమ ప్రాజెక్టు ద్వారా సమృద్ధిగా గోదావరి జలాలు వస్తున్న నేపథ్యంలో ప్రకాశం బ్యారేజి దిగువన వివిధ కాలువల ద్వారా డెల్టాలోని పంటలకు నీటిని విడుదల చేస్తున్నామని సీఎం అన్నారు. కృష్ణా తూర్పు ప్రధాన కాలువ నుంచి 3928 క్యూసెక్కులు, కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువ నుంచి 3115 క్యూసెక్కులు, గుంటూరు చానల్ నుంచి 115 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. డెల్టాకు నీటి సరఫరా కోసం మొత్తం కాలువలకు 7,158 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వివరించారు. ఎల్ నినో కారణంగా తీవ్ర వర్షాబావ పరిస్థితుల్లో పట్టిసీమ నీరు పంటలకు జీవం పోస్తోందని ఈ సందర్భంగా సీఎం అభిప్రాయ పడ్డారు. సమర్థ నీటి నిర్వహణ ద్వారా ఎల్ నినో పరిస్థితుల్లో సాగునీటి ఇబ్బందుల్ని అధిగమించేందుకు అన్ని విధాలా పనిచేయాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు.

## మెడికో ప్రియాంక మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు

- **బాధిత కుటుంబానికి రూ. 20 లక్షల ఆర్థిక సాయం**
- **జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఫోన్ లో మాట్లాడిన సీఎం**

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాజమండ్రిలో ఈ నెల 3వ తేదీన యువకులు కారుతో ఢీ కొట్టిన ఘటనలో మెడికో ప్రియాంక ప్రాణాలు కోల్పోవడం బాధాకరం అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. నాటి ఘటనలో గాయపడిన ప్రియాంక మృతి చెందిందనే వార్త తీవ్రంగా కలిచివేసిందన్నారు. ఎంతో భవిష్యత్ ఉన్న ఒక వైద్య విద్యార్థిని ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని సీఎం సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రియాంక ప్రాణాలు కోల్పోయిన ఘటనపై జిల్లా అధికారులతో గతంలోనే ఓసారి జిల్లా అధికారులతో సమీక్షించిన ముఖ్యమంత్రి ఆదివారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్ లో మరోసారి సీఎం చంద్రబాబు మాట్లాడారు. ప్రియాంక మృతికి కారణమైన నిందితులు ఇప్పటికే అరెస్టై జైల్లో ఉన్నారని ఎస్పీ వివరించగా.... నిర్లక్ష్యంతో నిండు ప్రాణం తీసిన వారిపై కఠిన సెక్షన్లతో శిక్షలు పడేలా చూడాలని సీఎం ఆదేశించారు. ప్రియాంకకు ప్రమాదం జరిగిన అనంతరం రాజమండ్రిలో చికిత్స అందించడం, తరువాత కుటుంబ సభ్యులు ఆమెను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించిన విషయాన్ని అధికారులు వివరించారు. బాధిత కుటుంబానికి రూ.20 లక్షల ఆర్థిక సాయం అందించాలని సీఎం అధికారులను ఆదేశించారు. అదే విధంగా బాధిత కుటుంబానికి ఇతరత్రా అన్ని విధాలుగా మద్దతుగా ఉంటామని సీఎం తెలిపారు.

## గిరిజనుల ఆత్మగౌరవానికి అండగా కూటమి

(మొదటి పేజీ తరువాయి)

మెగా డీఎస్సీ ద్వారా పెద్ద సంఖ్యలో గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు లభించాయని చెప్పారు. గత ప్రభుత్వం రద్దు చేసిన 18 గిరిజన సంక్షేమ పథకాలను పునరుద్ధరించి ఐటీడీఏలను బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు.

గిరిజన ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, వైద్య సదుపాయాలు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో భారీగా నిధులు ఖర్చు చేస్తున్నామని మంత్రి తెలిపారు. డోలీ మోతల సమస్యను నివారించేందుకు రహదారులు, ఫీడర్ అంబులెన్సులు, గర్భిణుల వసతి సదుపాయాలను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. అరకు కాఫీకి అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడంతో పాటు గిరిజనుల సంస్కృతి, కళలకు ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూలి , ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని అన్నారు. అరకు కాఫీకి ప్రపంచస్థాయి గుర్తింపు రావడానికి ప్రభుత్వం చేస్తున్న కృషి ఎంతో ఉందన్నారు.

గిరిజన కళ అయిన థింసా నృత్యానికి గిన్నిస్ వరల్డ్ రికార్డు ద్వారా అంతర్జాతీయ గుర్తింపు లభించిందని తెలిపారు. గిరిజన ప్రాంతాలు అభివృద్ధి చెందినప్పుడే నిజమైన 'స్వర్ణాంధ్ర' సాధ్యమవుతుందని పేర్కొన్నారు. విజయవాడ ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ,లి గిరిజన విద్యార్థులకు గురుకులాలు, నాణ్యమైన భోజనం, నైపుణ్యాభివృద్ధి శిక్షణతో పాటు ఐఏఎస్, గ్రూప్–1, డీఎస్సీ వంటి పోటీ పరీక్షలకు శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. గిరిజన ప్రాంతాలకు రోడ్డు కనెక్టివిటీ, వైద్య సదుపాయాలు, మొబైల్ ఆస్పత్రులు, టూవీలర్



అంబులెన్సులు, ఉచిత రేషన్ వంటి సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. భవిష్యత్తులో లక్ష ఎకరాల్లో కాఫీ సాగును విస్తరించి గిరిజనుల ఆదాయాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ,లి గిరిజనుల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. గిరిజన ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, వైద్య సదుపాయాలను మెరుగుపరిచినట్లు తెలిపారు. గిరిజన యువత ఉద్యోగ అవకాశాలకు సంబంధించి ప్రభుత్వం న్యాయ నిపుణులతో చర్చించి చట్టబద్ధమైన పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎం. మల్లికార్జున నాయక్ మాట్లాడుతూ,లి గిరిజన విద్య కోసం రూ. 1,353 కోట్లు కేటాయించి 1.63 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుస్తున్నామని తెలిపారు. డీఎస్సీ ద్వారా 1,916 మంది కొత్త ఉపాధ్యాయులను నియమించి గిరిజన ప్రాంతాల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరుస్తున్నామన్నారు. గిరిజన యువతకు ఉచిత సివిల్స్ కోచింగ్, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు అందిస్తున్నామని, రాబోయే ఐదేళ్లలో లక్ష ఎకరాల్లో కాఫీ సాగు విస్తరణతో పాటు పసుపు, రబ్బర్ హబ్‌ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. గిరిజనుల హక్కుల పరిరక్షణకు 1/70 చట్టాన్ని కఠినంగా అమలు చేస్తున్నామని తెలిపారు.

ముందుగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఇతర ప్రజా ప్రతినిధులు కలిసి అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

గిరిజనుల అభివృద్ధికి, గిరిజన ప్రాంతాల్లో చేపట్టే పలు అభివృద్ధి పనులకు అనేక కార్యక్రమాలు నిర్వహించేలా పలు ఒప్పందాలు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో కుదుర్చుకున్నారు. కాఫీ పంటను పండిస్తున్న గిరిజన రైతు కొర్రా రాంబాబు, డ్వాక్రా గిరిజన మహిళ రావూరి గాయత్రి లు ముఖ్యమంత్రి సమక్షంలో వారు మాట్లాడారు.

కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎస్. భార్గవి, జిల్లా కలెక్టర్ డా. జి లక్ష్మీశా, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్, ఎస్టీ కమిషన్ సభ్యులు గొర్ల సునీత, జిల్లా కలెక్టర్ డా. జి లక్ష్మీశ, గిరిజన నాయకులు ఇడ్డేశ్రీ, ధన్ను దొర, దారా నాయక్, శ్రీనివాసరెడ్డి, మోజోరి తేజావతి, గంగులయ్య, భూదేవి తదితరులు పాల్గొన్నారు.

## రష్యా నుంచి భారత్‌కు రైలు మార్గం!


(మొదటి పేజీ తరువాయి)

ఇందులో భాగంగా రష్యా నుంచి భారత్‌కు నేరుగా రైల్వే కనెక్టివిటీని ఏర్పాటు చేసే ప్రతిపాదనను ఆ దేశం పరిశీలిస్తోంది. రైలు మార్గం ద్వారా హిందూ మహాసముద్ర ప్రాంతానికి చేరుకునే అవకాశాలను అన్వేషిస్తున్నట్లు రష్యా ఉప ప్రధాని మరట్ ఖుస్నులిన్ తెలిపారు.

రష్యా ప్రభుత్వ వార్తాసంస్థ 'టాస్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. రష్యా నుంచి భారత్ వరకు రైల్వే మార్గాన్ని ఏర్పాటు చేస్తే రెండు దేశాల మధ్య ప్రత్యక్ష భూమార్గ అనుసంధానం ఏర్పడుతుందని, ఇది వాణిజ్యపరంగా ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు.

**పలు దేశాల మీదుగా...:** ప్రతిపాదిత రైల్వే కారిడార్ తుర్క్మెనిస్థాన్, ఇరాన్, అఫ్గానిస్థాన్, పాకిస్థాన్ మీదుగా భారత్‌కు చేరుకునే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు ఖుస్నులిన్ తెలిపారు. హోర్ముజ్, బొస్ఫోరస్ జలసంధుల మీదుగా సరకు రవాణా ప్రస్తుతం ప్రమాదకరంగా మారుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ మార్గాల అవసరం ఏర్పడిందన్నారు. హిందూ మహాసముద్ర ప్రాంతానికి రైల్వే మార్గాన్ని నిర్మించగలిగితే కీలకమైన ఈ రెండు జలసంధులపై ఆధారపడటం గణనీయంగా తగ్గుతుందని చెప్పారు. అయితే ప్రస్తుతానికి ఇది ప్రాథమిక ప్రతిపాదన మాత్రమేనని, దీని సాధ్యాసాధ్యాలను పరిశీలించాల్సి ఉందని స్పష్టం చేశారు.

**ఆంక్షల వేళ కీలక ప్రతిపాదన :** రష్యా ఇంధన ఎగుమతులపై అమెరికా, ఐరోపా దేశాల ఆంక్షలు



కొనసాగుతున్న నేపథ్యంలో భారత్‌కు ప్రత్యామ్నాయ భూ రవాణా మార్గాన్ని ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ప్రాధాన్యం సంతరించుకుంది. సముద్ర మార్గాల్లో ఎదురయ్యే అంతరాయాలను అధిగమించేందుకు ప్రత్యామ్నాయ రవాణా వ్యవస్థలను అభివృద్ధి చేయడం రష్యాకు వ్యూహాత్మకంగా ఉపయోగపడనుంది.

**భారత్‌కూ ప్రయోజనమే:** ఈ రైల్వే కారిడార్ అందుబాటులోకి వస్తే రష్యా తన సరకు రవాణాను సముద్ర మార్గాలపై తక్కువ ఆధారపడుతూ హిందూ మహాసముద్రం వైపు మళ్లించుకునే అవకాశం ఉంటుంది. అదే సమయంలో మధ్య, దక్షిణాసియా దేశాలతో రష్యాకు భూమార్గ అనుసంధానం మరింత బలోపేతం కానుంది.

భారత్‌కు కూడా ఈ ప్రతిపాదన ప్రయోజనకరంగా మారే అవకాశం ఉంది. రష్యా, మధ్య ఆసియా దేశాలతో వాణిజ్య, రవాణా సంబంధాలను మరింత విస్తరించేందుకు ఈ కారిడార్ దోహదపడొచ్చు. సరకు రవాణా సమయం, ప్రత్యామ్నాయ మార్గాల లభ్యత వంటి అంశాల్లోనూ ప్రయోజనం కలగవచ్చని భావిస్తున్నారు.

**సవాళ్లు ఎన్నో :** అయితే ఈ ప్రతిపాదనను ఆచరణలోకి తీసుకురావడం అంత సులభం కాదు. రైల్వే మార్గం పలు దేశాల భూభాగాల మీదుగా వెళ్లాల్సి ఉండటం, అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాటు, భద్రత, వివిధ దేశాల మధ్య సమన్వయం వంటి అంశాలు ప్రధాన సవాళ్లుగా నిలవనున్నాయి. ముఖ్యంగా అఫ్గానిస్థాన్, పాకిస్థాన్ మీదుగా రవాణా మార్గాన్ని అభివృద్ధి చేయడం కీలక సవాలుగా మారనుంది.

అన్ని దేశాల సహకారం, భారీ స్థాయిలో మౌలిక సదుపాయాల కల్పన సాధ్యమైతేనే ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చనుంది. ప్రస్తుతం ఇది చర్చల దశలోనే ఉన్నప్పటికీ.. రష్యా–భారత్ మధ్య ప్రత్యక్ష భూ రవాణా మార్గానికి బాటలు వేయాలన్న ఆలోచన వ్యూహాత్మకంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

## అండర్-20 అథ్లెటిక్స్‌లో భారత్ జోరు

(మొదటి పేజీ తరువాయి)

భారత్‌కు పతకం అందించిన తొలి అథ్లెట్‌గా బసంత్ రికార్డు సృష్టించాడు. హైజంప్‌లో అల్జీరియాకు చెందిన యూనిస్ అయాచి, బసంత్ కుమార్, బ్రిటన్‌కు చెందిన ఓటిస్ పూల్ 2.21 మీటర్ల ఎత్తును అధిగమించారు. అయితే అయాచి తొలి ప్రయత్నంలోనే 2.21 మీటర్లు దూకడంతో స్వర్ణ పతకం సాధించాడు. బసంత్ రెండో ప్రయత్నంలో ఈ ఎత్తును అందుకోవడంతో రజతంతో సరిపెట్టుకున్నాడు. ఓటిస్ పూల్ మూడో ప్రయత్నంలో 2.21 మీటర్లు అధిగమించి కాంస్య పతకం సాధించాడు. మరోవైపు పురుషుల లాంగ్‌జంప్‌లో షానవాజ్ ఖాన్ 7.84 మీటర్ల దూరం దూకి కాంస్య పతకం సాధించాడు. అండర్–20 ప్రపంచ ఛాంపియన్‌షిప్ లాంగ్‌జంప్‌లో భారత్‌కు లభించిన తొలి పతకం ఇదే కావడం విశేషం.

## మెడికో ప్రియాంక కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

ప్రియాంక స్వస్థలం జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలం ఏక్లాస్‌పూర్. ఎంబీబీఎస్ పూర్తిచేసిన ఆమె తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలోని జీఎస్ఎల్ వైద్య కళాశాలలో డెర్మటాలజీ విభాగంలో పీజీ మొదటి సంవత్సరం చదువుతున్నారు. తల్లిదండ్రులు హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ప్రియాంక ఈ నెల 3న రాత్రి రాజమహేంద్రవరం ప్రసాద్ ఆదిత్యమాల్‌లో సినిమా చూసి, సహచర విద్యార్థి ఉమేష్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు.

రద్దీ కారణంగా వాహనాలు థియేటర్ గేటు వద్ద ఆగగా అదే సమయంలో నామవరానికి చెందిన సురవరపు దుష్యంత్, లాలాచెరువుకు చెందిన ఆండ్రూ విలియం జోసెఫ్‌లు మద్యం మత్తులో కారు వేగంగా నడుపుతూ వచ్చి వీరి బైక్‌ను ఢీకొట్టారు. తరువాత మరో రెండుసార్లు బలంగా ఢీకొట్టి, పైనుంచి కారు వెళ్లడంతో కిందపడిపోయిన ప్రియాంక తలకు తీవ్ర గాయమైంది. ఆమెను స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. పరిస్థితి విషమించడంతో బుధవారం సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందారు.

**ఏపీ సీఎం చంద్రబాబు తీవ్ర విచారం :** మెడికో ప్రియాంక మృతిపై ఏపీ సీఎం చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆమె కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎంతో భవిష్యత్తు ఉన్న వైద్య విద్యార్థిని ప్రాణాలు కోల్పోవడం కలచివేసిందన్నారు. నిర్లక్ష్యంతో కారు నడిపిన నిందితులకు కఠిన శిక్షలు పడేలా చూస్తామని చెప్పారు. ఈ మేరకు పోలీసు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. ప్రియాంక కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని సీఎం చెప్పారు.

**పరిస్థితిని బట్టి మరిన్ని కఠిన శిక్షలు :** మరోవైపు మెడికో ప్రియాంక కేసులో కీలక ఆధారాలు సేకరించినట్లు తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ నరసింహా కిషోర్ తెలిపారు. నిందితులు వరుసగా మూడుసార్లు ప్రియాంక ప్రయాణిస్తున్న స్కూటీని ఢీకొట్టినట్లు సీసీ కెమెరా ఫుటేజీలో తేలిందన్నారు. నిందితులు హిట్ అండ్ రన్ చేసి క్రూరంగా వ్యవహరించి పరారయ్యారన్నారు. యువకులపై కఠిన సెక్షన్లు ఇప్పటికే నమోదు చేశామని, పరిస్థితిని బట్టి అదనంగా మరిన్ని కఠిన శిక్షలు పడే సెక్షన్లు పెడతామన్నారు.

## ట్రావెల్స్ బస్సును ఢీకొట్టిన ఐషర్

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఘటనలో బస్సులో ప్రయా ణిస్తున్న సుమారు 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో పలువురి పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాద సమయంలో బస్సులో దాదాపు 32 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘట నాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని పామిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. తీవ్రంగా గాయ పడిన మరికొందరిని మెరుగైన చికిత్స కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

రెండు వాహనాల డ్రైవర్లు క్యాబిన్లలో చిక్కుకు పోయారు. పోలీసులు, స్థానికులు తీవ్రంగా శ్రమించి వాహనాల భాగాలను కట్ చేసి ఇద్దరు డ్రైవర్లను బయటకు తీశారు. వారిద్ద రికీ తీవ్ర గాయాలయ్యాయి. ముఖ్యంగా బస్సు డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

**నిద్రమత్తు, అతివేగమే కారణమా?**

హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళ్తున్న ఐషర్ వాహనం అదు పుతప్పి ట్రావెల్స్ బస్సును ఢీకొట్టడంతో ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. ఐషర్ డ్రైవర్ నిద్రమత్తులో ఉండటం, అతివేగంగా వాహనం నడపడం ప్రమాదానికి కారణమై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రమాదం కారణంగా హైదరాబాద్–బెంగళూరు జాతీయ రహదారిపై కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు వెంటనే ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి రాకపోకలను పునరుద్ధరించారు.

క్యాబిన్లలో చిక్కుకున్న డ్రైవర్లు ప్రమాదంలో బస్సు, ఐషర్ వాహనాల ముందు భాగాలు పూర్తిగా ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# బహిరంగ చర్చకు సవాల్ చేస్తే తోకముడిచారు

(మొదటి పేజీ తరువాయి)

తెదేపా గుంటూరు జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆలపాటి మాట్లాడుతూ ఆధారాలు లేకుండా పదేపదే ఆరోపణలు చేయడం వల్ల నిరుద్యోగ యువతలో అనవసర ఆందోళన కలిగే అవకాశం ఉందన్నారు. తాను సుమారు 40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని, మంచి జరిగినప్పుడు మంచిని అంగీకరించే రాజకీయ సంస్కృతి ఉండాలని సూచించారు. జెన్–జీ చేపట్టిన నిరసనల్లో ఎంతమంది డీఎస్సీ అభ్యర్థులు ఉన్నారో వైకాపా నాయకులు చెప్పాలని ప్రశ్నించారు.

శనివారం ఉదయం అంబేద్కర్ సెంటర్‌కు చేరుకున్న ఆలపాటి.. వైకాపా నాయకుల కోసం దాదాపు గంటసేపు వేచి ఉన్నారు. ఆయన సవాల్ నేపథ్యంలో వైకాపా నేతలు వస్తారేమోనని పోలీసులు ముందస్తుగా అప్రమత్తమై బలగాలను మోహరించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు కూడా అక్కడికి చేరుకున్నారు. అయితే ఎంతసేపు ఎదురుచూసినా వైకాపా నాయకులు ఎవరూ రాకపోవడంతో ఆలపాటి అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైకాపా నాయకులు ఎక్కడికి రమ్మన్నా అక్కడికి వెళ్లి చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు.






వైకాపా హయాంలో ఐదేళ్లలో ఒక్క జాబ్ క్యాలెండర్ కూడా విడుదల చేయలేదని ఆలపాటి విమర్శించారు. అధికారంలోకి రాగానే జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి నిరుద్యోగులను నిరాశకు గురిచేశారని ఆరోపించారు. డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయని నిరూపించే ఆధారాలు ఉంటే బహిరంగ చర్చకు తీసుకురావాలని, కేవలం ఆరోపణలు చేస్తే ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు.

కార్యక్రమంలో తెదేపా నాయకులు కనపర్తి శ్రీనివాసరావు, మద్దిరాల మ్యాని, వేములకొండ శ్రీనివాస్, చిట్టాబత్తిన చిట్టిబాబు, పాములపాటి శ్రీనివాసరావు, కొమ్మినేని కోటేశ్వరరావు, గోళ్ల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీల సంస్కృతి, హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత



- **మంత్రి నారా లోకేష్**

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా గిరిజన సోదర సోదరీమణులకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ శుభాకాంక్షలు తెలిపారు. ఆదివాసీ సంస్కృతి ప్రకృతితో కలిసి జీవించే గొప్ప జీవన తత్వమని పేర్కొన్నారు. పరస్పర సహకారం, మంచితనం, మానవత్వానికి ఆదివాసీలు ప్రతీకలుగా నిలుస్తారని అన్నారు.

ఆదివాసీల సమగ్ర అభ్యున్నతితో పాటు వారి సంస్కృతి, సంప్రదాయాలు, హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రజా ప్రభుత్వంపై ఉందని నారా లోకేష్ పేర్కొన్నారు. ఆదివాసీ సమాజ సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

## ఆషాఢ మాస ఉత్సవాలలో భాగంగా అమ్మవార్లకు సారె సమర్పించిన మంత్రి కందుల దుర్గేష్



- **పందలపర్రు, తిమ్మరాజుపాలెం క్షేత్రాలలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు**
- **రాష్ట్ర ప్రజల సంతోషం, సమగ్ర అభివృద్ధే ధ్యేయమని వెల్లడి**

**నిడదవోలు (జర్నలిస్ట్ ఫైల్):** నిడదవోలు మండలంలో పవిత్ర ఆషాఢ మాస ఉత్సవాలు ఆధ్యాత్మిక శోభతో అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రివర్యులు కందుల దుర్గేష్ ఆదివారం మండల పరిధిలోని పందలపర్రు, తిమ్మరాజుపాలెం గ్రామాల్లోని ప్రముఖ ఆలయాలను సందర్శించి అమ్మవార్ల కృపాకటాక్షాలకై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా పందలపర్రు గ్రామంలో వేంచేసియున్న శ్రీ గోగులమ్మ తల్లి, శ్రీ మహాలక్ష్మీ తల్లి, శ్రీ సత్తెమ్మ తల్లి అమ్మవార్లను మంత్రి కందుల దుర్గేష్ దర్శించుకున్నారు. ఆషాఢ మాస పవిత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తిశ్రద్ధలతో అమ్మవార్లకు సాంప్రదాయబద్ధంగా "ఆషాఢ సారె" సమర్పించి, ప్రత్యేక పూజలు గావించారు. అనంతరం తిమ్మరాజుపాలెంలో ప్రసిద్ధి చెందిన శ్రీ కోటసత్తెమ్మ అమ్మవారి దివ్యక్షేత్రాన్ని మంత్రివర్యులు దుర్గేష్ సందర్శించారు. ఆషాఢ మాస ఉత్సవాలలో భాగంగా వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో "శాకాంబరీ దేవి" గా విశేష అలంకరణలో భక్తులకు దివ్య దర్శనమిస్తున్న శ్రీ కోటసత్తెమ్మ తల్లిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయానికి విచ్చేసిన మంత్రివర్యులకు ఆలయ నిర్వాహకులు, అర్చకులు వేదమంత్రోచ్చారణల నడుమ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వేదాశీర్వచనం అందించారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ... అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలంతా సకల శుభాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. రాష్ట్రం అన్ని రంగాల్లోనూ ముందంజ వేసి సమగ్ర అభివృద్ధి సాధించాలని శ్రీ కోటసత్తెమ్మ తల్లిని ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తజనానికి మంత్రి దుర్గేష్ అభివాదం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## బ్రహ్మంగారి రథశాలకు మరమ్మత్తులు



బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్): కాలజ్ఞానకర్త జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి రథానికి భద్రత కల్పించే ఉద్దేశంతో రథశాలకు షట్టర్ ఏర్పాటు చేస్తున్నామని వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం మఠాధిపతి శ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వామి ఓ ప్రకటనలో తెలిపారు ఆదివారం ఆయనే స్వయంగా రథశాలను పరిశీలించారు. గాలి వాన కి రథానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రథశాలకు షెట్టర్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందుకు సంబంధించిన షెటర్ పనులను పరిశీలించి పనులు చేపడుతున్న వారితో మాట్లాడారు. రథశాలకు షట్టర్ ఏర్పాటు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

రథం భద్రతకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని నిర్మాణ పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని మఠాధిపతి సూచించారు.

ఈ కార్యక్రమంలో మఠాధిపతి సోదరుడు దత్తాత్రేయ స్వామి మఠం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మంగారి నివాస పునర్నిర్మానికి లక్ష రూపాయలు విరాళం

**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్ ):** భూత భవిష్యత్ వర్తమాన కాలజ్ఞానాన్ని రచించిన జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి నివాసశీ గృహము పూర్తిగా పడిపోవడం తో మరలా స్వామివారిగృహం ను నూతనంగా నిర్మాణం చేపడుతూ వుండడం వలన బ్రహ్మం గారి భక్తులైన కర్నూలు వాస్తవ్యులు కీర్తిశేషులు గుజరాతి వీరబ్రహ్మంగారి జ్ఞాపకార్థం వారి కుమారులు గుజరాతి అరుణ్ ధర్మపత్ని సాహితి,గుజరాతి రాకేష్ ధర్మపత్ని సంజన, వారు 1,00,302విరాళంగా బ్రహ్మం గారి నూతన గృహ నిర్మాణంనకు ఇవ్వడం మా పూర్వ జన్మసుకృతం అని, విరాళంను ఆలయ సిబ్బంది పరిపూర్ణ వేణు గోపాల్, రాజా లకు అందజేశారు.

## విదేశీ నిధుల నియంత్రణ చట్టం సవరణలతో పారదర్శకత, జవాబుదారీతనం

- **బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానెలిస్ట్ తాడువాయి రామకృష్ణ**



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** విదేశీ నిధుల నియంత్రణ చట్టంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సవరణలు దేశ భద్రత, ఆర్థిక పారదర్శకతకు రక్షణ కవచంగా నిలుస్తాయని ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానెలిస్ట్ తాడువాయి రామకృష్ణ అన్నారు. విదేశాల నుంచి వచ్చే నిధులు పక్కదారి పట్టకుండా పర్యవేక్షణ పెరగడంతో పాటు వాటి వినియోగంలో జవాబుదారీతనం పెరుగుతుందని పేర్కొన్నారు.

విదేశీ నిధుల ద్వారా జరిగే అక్రమ కార్యకలాపాలు, దుర్వినియోగాన్ని అడ్డుకునేందుకు కఠినమైన నిబంధనలు అవసరమని రామకృష్ణ అన్నారు. విదేశాల నుంచి వచ్చే ప్రతి రూపాయి నిర్దేశిత బ్యాంకు ఖాతా ద్వారా రావడం వల్ల నిధుల ప్రవాహాన్ని స్పష్టంగా గుర్తించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఎన్‌జీవోలు తమ ఆర్థిక లావాదేవీలకు సంబంధించి నిర్దిష్ట కాల వ్యవధిలో ఖాతాలను సమర్పించాల్సి రావడం వల్ల పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతాయని చెప్పారు.

విదేశీ నిధులను దుర్వినియోగం చేస్తూ దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే సంస్థలపై నియంత్రణ అవసరమని ఆయన పేర్కొన్నారు. అదే సమయంలో రైతులు, పేదలు, వెనుకబడిన వర్గాలకు నిజాయితీగా సేవలందించే స్వచ్ఛంద సంస్థలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిధులు సద్వినియోగం అయ్యేలా వ్యవస్థ ఉండాలని అన్నారు. పరిపాలన, నిర్వహణ ఖర్చులపై పరిమితులు విధించడం ద్వారా విదేశీ నిధులు ప్రజా ప్రయోజనాలకు మరింతగా వినియోగించే అవకాశం ఉంటుందని తెలిపారు.

దేశ సార్వభౌమత్వం, అంతర్గత భద్రతను కాపాడుకోవడంతో పాటు విదేశీ జోక్యానికి అవకాశం లేకుండా చేయడం ప్రతి ప్రభుత్వ బాధ్యత అని తాడువాయి రామకృష్ణ అన్నారు. విదేశీ నిధుల నియంత్రణ చట్టం నిబంధనలు అణచివేతకు ఉద్దేశించినవి కావని, విదేశీ నిధుల దుర్వినియోగాన్ని అరికట్టి దేశ ప్రయోజనాలను పరిరక్షించేందుకు తీసుకునే చర్యలని ఆయన పేర్కొన్నారు. నకిలీ, నిబంధనలను ఉల్లంఘించే సంస్థలను కట్టడి చేయడం ద్వారా ప్రజలకు అందాల్సిన సేవలు మరింత సమర్థవంతంగా చేరుతాయని తెలిపారు. దేశ భద్రత, పారదర్శకత, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాలకు ఇటువంటి చర్యలు దోహదపడతాయని తాడువాయి రామకృష్ణ పేర్కొన్నారు.

## పేకాట స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు

- **నల్లపాడులో 10 మంది.. పెదనందిపాడులో ఐదుగురు అరెస్ట్**



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లాలో పేకాట, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలపై గుంటూరు జిల్లా పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. నల్లపాడు, పెదనందిపాడు పోలీస్‌స్టేషన్ల పరిధిలో పేకాట స్థావరాలపై టాస్క్‌ఫోర్స్, ఎస్‌బీ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి 15 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.16,190 నగదు, 15 సెల్‌ఫోన్లు, ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

**చిన్నపలకలూరులో 10 మంది అరెస్ట్ :** నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిన్నపలకలూరు గ్రామ శివారులో యూకలిప్టస్ తోటలో ముళ్లచెట్ల మధ్య పేకాట నిర్వహిస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. డీఎస్‌బీ డీఎస్పీకి సమాచారం అందించి, సీఐ–2 ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం టాస్క్‌ఫోర్స్, ఎస్‌బీ నల్లపాడు సిబ్బంది సంయుక్తంగా దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న 10మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 10 సెల్‌ఫోన్లు, ఆరు ద్విచక్ర వాహనాలు, రూ.6,360 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను, స్వాధీనం చేసుకున్న వస్తువులను తదుపరి విచారణ, చట్టపరమైన చర్యల కోసం నల్లపాడు పోలీస్‌స్టేషన్ సిబ్బందికి అప్పగించారు.

**కొప్పర్రులో ఐదుగురు పట్టివేత:** పెదనందిపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొప్పర్రు గ్రామంలో హిందూ స్మశాన వాటిక పక్కన ఉన్న రేకుల షెడ్‌లో పేకాట జరుగుతున్నట్లు ఆదివారం సాయంత్రం 4.10 గంటలకు ఎస్‌బీ పోలీసులకు సమాచారం అందింది. డీఎస్‌బీ డీఎస్పీకి సమాచారం అందించి, సీఐ–2 ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్, ఎస్‌బీ పెదనందిపాడు పోలీసులు సంయుక్తంగా దాడి నిర్వహించారు. ఈ దాడిలో ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి ఐదు సెల్‌ఫోన్లు, రూ.9,830 నగదును స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తులను, స్వాధీనం చేసుకున్న వస్తువులను తదుపరి విచారణ, చట్టపరమైన చర్యల నిమిత్తం పెదనందిపాడు పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు.

**జూదంపై కఠిన చర్యలు :** పేకాట, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని గుంటూరు జిల్లా పోలీసులు హెచ్చరించారు. జిల్లాలో ఇటువంటి కార్యకలాపాలను అరికట్టేందుకు నిఘా, దాడులు కొనసాగుతాయని తెలిపారు.

## ప్రజలకు-ఉద్యోగులకు వైరం తెచ్చే ప్రయత్నం మానుకోవాలి

ఉద్యోగుల జీతాలను అదనపు భారంగా చూపడం సరికాదు : ఏపీటీఎఫ్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఉద్యోగులు, ఉపాధ్యాయుల జీతభత్యాలను ప్రభుత్వంపై పడుతున్న అదనపు ఆర్థిక భారంగా చూపించడం సరికాదని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు, ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి అన్నారు. ఉద్యోగుల జీతాలపై తప్పుడు గణాంకాలతో ప్రజలకు, ఉద్యోగులకు మధ్య వైరం సృష్టించే ప్రయత్నాలను ప్రభుత్వం మానుకోవాలని వారు ఒక ప్రకటనలో కోరారు.

**బడ్జెట్‌లో జీతాలు, పెన్షన్ల వాటా 28.4 శాతమే**

2026--27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ గణాంకాలను పరిశీలిస్తే ఉద్యోగుల జీతాలు, పెన్షన్లకు సంబంధించిన వ్యయం మొత్తం రాష్ట్ర బడ్జెట్ వ్యయంలో సుమారు 28.4 శాతం మాత్రమేనని ఏపీటీఎఫ్ నేతలు తెలిపారు. రెవెన్యూ వ్యయంలో జీతాలు, పెన్షన్ల వాటా సుమారు 36.9 శాతంగా ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర సొంత రెవెన్యూ పరంగా చూసినా ఉద్యోగుల జీతాలు, పెన్షన్లకు 95 శాతం ఖర్చవుతున్నాయనే ప్రచారం వాస్తవాలకు విరుద్ధమని స్పష్టం చేశారు.

**జీతాలు ప్రభుత్వ సేవల నిర్వహణలో భాగమే**

ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ప్రజలకు వివిధ సేవలు అందిస్తున్నారని, వారి జీతాలను కేవలం ప్రభుత్వంపై పడుతున్న ఆర్థిక భారంగా పరిగణించడం సమంజసం కాదని ఏపీటీఎఫ్ నేతలు అన్నారు. ప్రభుత్వ సేవల నిర్వహణకు అవసరమైన వ్యయంగా ఉద్యోగుల జీతాలను చూడాలని సూచించారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రజలకు వాస్తవాలను వెల్లడించాలంటే రాష్ట్ర సొంత పన్ను ఆదాయం, పన్నేతర ఆదాయం, కేంద్ర పన్నుల వాటా, కేంద్ర గ్రాంట్లు, అప్పులు తదితర ఆదాయ వనరులను విడివిడిగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా జీతాలు, పెన్షన్లు, అప్పులపై వడ్డీ, సంక్షేమ పథకాలు, మూలధన వ్యయం తదితర అంశాలపై ప్రభుత్వం చేస్తున్న ఖర్చును కూడా పారదర్శకంగా ప్రజల ముందుంచాలని కోరారు.

**12వ పీఆర్సీ ఏర్పాటు చేయాలి**

ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను సకాలంలో చెల్లించకుండా ప్రభుత్వం కాలయాపన చేయడానికి గణాంకాలను ఉపయోగించరాదని వారు అన్నారు. వెంటనే 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేసి, 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయడంతో పాటు ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లకు హక్కుగా రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఏపీటీఎఫ్ నేతలు కోరారు.

## పెన్షన్ వ్యాలిడేషన్ క్లాజ్ ను రద్దు చేయాలి

- **సీ.బీ.ఐ.సీ పెన్షనర్స్ అసోసియేషన్ ఎపి అధ్యక్షుడు టి. వివేకానంద**



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** కేంద్ర ప్రభుత్వం పెన్షనర్ల హక్కులను కాలరాసే చర్యలు చేపట్టిందని, దానిని వెంటనే విరమించుకోవాలని సెంట్రల్ బోర్డు అఫ్ ఇండైరెక్ట్ ట్యాక్స్ స్ అండ్ కస్టమ్స్ (సీ.బీ.ఐ.సీ) పెన్షనర్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు టి. వివేకానంద డిమాండ్ చేసారు. ఆదివారం గుంటూరు కన్నవారితోటలోని జీఎస్టీ భవన్ లో ఎనిమిదవ వేతన సంఘం సమస్యలపై ఎ.పి లోని పలు ప్రాంతాల పెన్షనర్ల సంఘం ప్రతినిధులతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు టి. వివేకానంద మాట్లాడుతూ.. పెన్షనర్ల ప్రయోజనాలకు విఘాతం కలిగించే పెన్షన్ వ్యాలిడేషన్ యాక్ట్ ను కేంద్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేసారు. ప్రభుత్వం పెన్షన్ చట్టం మూలాలకు సవరణలు తెస్తుందని, పెన్షనర్ల మధ్య పాత, కొత్త విభేదాలు సృష్టిస్తుందన్నారు. అసోసియేషన్ ఉపాధ్యక్షులు బి. రాజేశ్వరరావు మాట్లాడుతూ..ఎనిమిదవ వేతన కమిషన్ పెన్షనర్లకు మేలు జరిగేలా ఉండాలన్నారు. లోపాలన్ని సవరించాలన్నారు. పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సిఫార్సు చేసిన అదనపు పెన్షన్ ను ప్రభుత్వం వెంటనే ఆమోదించాలన్నారు.

సంఘం జాయింట్ సెక్రటరీ పి. వి. సత్యనారాయణ మాట్లాడుతూ.. ఎనిమిదవ వేతన కమిషన్ ఆలస్యం నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే ఐ. ఆర్ ను విడుదల చేయాలని, యాభై శాతం డి. ఎ ను బేసిక్ పెన్షన్ లో విలీనం చేయాలని డిమాండ్ చేసారు. డిమాండ్ల ను ప్రభుత్వం అమలు చేయని పక్షంలో పోరాటానికి సిద్ధమవ్వాలని సమావేశం తీర్మానించింది ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం ప్రతినిధులు గుమ్మడి సీతారామయ్యచౌదరి, పి. కోటేశ్వరరావు, ఎన్. ఎస్. నగేష్ బాబు, కె. సాంబ్రాజ్యం, డి. మధు బాబు, షేక్ మస్తాన్, బి.ఎల్. ఆదినారాయణ, ఎన్. ప్రకాష్ బాబు, పూర్ణచంద్రరావు, ఆషా, ఈశ్వరమ్మ, నాగశంకర్, నంద కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఆర్ఐ ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్లట్టర్‌పై వర్క్‌షాప్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ) విభాగం ఆధ్వర్యంలో విద్యార్థుల సాంకేతిక, ప్రాక్టికల్ నైపుణ్యాలను పెంపొందించే ఉద్దేశంతో 'ఫ్లట్టర్ ఫ్రేమ్‌వర్క్'పై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రముఖ సాంకేతిక నిపుణుడు కె.ప్రదీప్ రిసోర్స్ పర్సన్‌గా పాల్గొని విద్యార్థులకు ఫ్లట్టర్ ఫ్రేమ్‌వర్క్‌పై అవగాహన కల్పించారు.

ఫ్లట్టర్ ద్వారా మొబైల్ అప్లికేషన్ల అభివృద్ధి, యూజర్ ఇంటర్‌ఫేస్ డిజైన్, యాప్ డెవలప్‌మెంట్ ప్రక్రియ, ప్రాక్టికల్ అమలుకు సంబంధించిన అంశాలను ప్రదీప్ వివరించారు. ప్రాక్టికల్ డెమోల ద్వారా విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వివిధ అంశాలను ప్రాక్టికల్‌గా నేర్చుకోవడంతో పాటు రిసోర్స్ పర్సన్‌తో చర్చించి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

ఈ సందర్భంగా కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.శరత్ మాట్లాడుతూ ఐటీ రంగంలో వేగంగా మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను నిరంతరం అభివృద్ధి చేసుకోవాలని అన్నారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఇటువంటి వర్క్‌షాప్‌లు కీలకంగా నిలుస్తాయని తెలిపారు.

కళాశాల ప్రిన్సిపాల్ డా.సంజయ్ మాట్లాడుతూ పాఠ్యాంశాలతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు ప్రాక్టికల్ అవగాహన అవసరమన్నారు. ఫ్లట్టర్ వంటి ఆధునిక ఫ్రేమ్‌వర్క్‌లపై శిక్షణ పొందడం ద్వారా మొబైల్ అప్లికేషన్ డెవలప్‌మెంట్ రంగంలో విద్యార్థులు మెరుగైన అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని తెలిపారు. కార్యక్రమాన్ని సీఎస్ఈ విభాగం అధ్యాపకులు సమన్వయం చేసి విజయవంతంగా నిర్వహించారు.

## ఎన్ఆర్ఐ ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్లట్టర్‌పై వర్క్‌షాప్



- **వ్యాపారాలకు ప్రోత్సాహం.. యువతకు అవకాశాలు**
- **గుంటూరు అభివృద్ధికి బీ2 ఎక్స్‌పో మరో అడుగు**

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** స్థానిక వ్యాపారాలను ప్రోత్సహించడం, యువతలో వ్యాపార ఆలోచనలను పెంపొందించడం, కొత్త అవకాశాలు, ఉపాధిని సృష్టించడమే లక్ష్యంగా బీ2 ఎక్స్‌పో--2026 నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. బండ్లమూడి గార్డెన్స్‌లో ఆగస్టు 7 నుంచి మూడు రోజులుగా నిర్వహించిన ఎక్స్‌పో ఆదివారంతో ముగిసింది.

**వ్యాపారులకు మంచి వేదిక**

ఎక్స్‌పో ముగింపు కార్యక్రమానికి మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, హిందూ ఫార్మసీ కాలేజ్ చైర్మన్ జూపూడి రంగరాజు, గాదె వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుంటూరులోని పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు, చిన్న, మధ్యతరహా సంస్థలకు తమ ఉత్పత్తులు, సేవలను పరిచయం చేసుకునేందుకు బీ2 ఎక్స్‌పో మంచి వేదికగా నిలిచిందన్నారు.

గుంటూరును మరింత ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు స్థానిక వ్యాపారాలను ప్రోత్సహించడం, యువ ఎంటర్‌ప్రెన్యూర్లకు అవకాశాలు కల్పించడం, మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం వంటి లక్ష్యాలతో ఇలాంటి కార్యక్రమాలను మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు.

**వ్యాపారంతో పాటు సామాజిక బాధ్యత**

మూడు రోజుల ఎక్స్‌పోలో వ్యాపార, పారిశ్రామిక ప్రదర్శనలతో పాటు సమాజ సేవకు జీవితాలను అంకితం చేసిన మహనీయులను స్మరించుకునే కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యాపార విజయంతో పాటు సమాజానికి తిరిగి సేవ చేయాలనే ఆలోచన పారిశ్రామికవేత్తలు, యువతలో పెరగాలని నిర్వాహకులు సందేశం ఇచ్చారు. వ్యాపార అభివృద్ధితో పాటు సామాజిక బాధ్యతకు సమాన ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని కార్యక్రమం చాటిచెప్పిందన్నారు.

శ్రీధర్ బాబు, హేమంత్ కుమార్ సారథ్యంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో కన్వీనర్ రవిశంకర్, ఏ.వి.రమణమూర్తి, వీరకుమార్, బద్రి, కోటేశ్వరరావు, బ్లూక్రాస్ కుమార్, డాక్టర్ రమణ, అన్నంరాజు వంశీ, డాక్టర్ కాకాని పృథ్వీరాజ్, డాక్టర్ విజయభాస్కర్, సుందర్ రామశర్మ, బైరిశెట్టి మల్లికార్జునరావు, డాక్టర్ దీవి జయరాం, ఎల్చూరి వెంకటేశ్వర్లు, ఆడిటర్ బ్రహ్మం తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు



# 15వ వార్షికోత్సవానికి ఆహ్వానం..

## ప్రముఖులను ఆహ్వానించిన ఆదాబ్ ప్రతినిధులు..





హైదరాబాద్, ఆగస్టు 09 (జర్నలిస్ట్ ఫైల్) : పత్రికా ప్రపంచంలో ఒక ప్రత్యే కతను చాటు కుంటూ.. ప్రజలకు, ప్రభు త్వానికి వారధిగా ఉంటూ ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తూ.. 14 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణాన్ని విజయవంతంగా సాగించి, 15వ సంవత్సరంలోకి అడుగిడు తున్న ఆదాబ్ హైదరాబాద్ తెలుగు దినపత్రిక తమ 15వ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపు కోనుంది.. ఈనెల 26నాడు రవీంద్రభారతి వేదికగా జరుగుతున్న ఈ వేడుకకు పలువురు ప్రముఖులకు ఆహ్వానం పలికారు ఆదాబ్ ప్రతినిధులు.. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, తెలంగాణ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్. రాహుల్ దేవరాజ్ లను కలిసి ఆహ్వానపత్రిక అందించారు ఆదాబ్ ప్రతినిధులు.. ఆహ్వానం అందుకున్నవారు తప్పకుండా కార్యక్రమానికి హాజరవుతామని చెబుతూ ఆదాబ్ యాజమాన్యానికి, సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు..

## ఔటర్ వద్ద పిల్లర్‌ను ఢీకొన్న కారు

### ఇద్దరు టైల్స్ కార్మికుల దుర్మరణం

హైదరాబాద్, నగరంలో ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శుక్రవారం అర్ధరాత్రి గచ్చిబౌలి సమీపంలోని నియోపోలీస్ బ్రిడ్జి పిల్లర్‌ను టవేరా కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. అదే రహదారిపై వెళ్తున్న వాహనదారులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని.. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాలను ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతులు రాజస్థాన్‌కు చెందిన కన్హైయాలాల్ (25), దేరామ్ (24)గా గుర్తించామని తెలిపారు. వీరిద్దరు టైల్స్ కార్మికులుగా పని చేస్తున్నారని చెప్పారు. ఇంద్రారెడ్డి నగర్ నుంచి నానక్‌రామ్ గూడ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని అన్నారు.

### పర్యావరణ పరిరక్షణలో

# ప్రతి ఒక్కరు భాగ్యస్వాములు కావాలి

### - మాజీ కార్పొరేటర్ పవన్ కుమార్



కొత్తపేట ఆగస్టు 09 (జర్నలిస్ట్ ఫైల్) : పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగ్యస్వాములు కావాలని కొత్తపేట మాజీ కార్పొరేటర్ పవన్ కుమార్ పేర్కొన్నారు. మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కొత్తపేట డివిజన్ పరిధిలోని సత్యనగర్ కాలనీలో శనివారం వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించడం ద్వారా కాలనీల్లో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పరచడంతో పాటు, పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యతను కూడా ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. మొక్క నాటడం మన బాధ్యత... మొక్కను సంరక్షించడం మన కర్తవ్యం అనే సందేశంతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బిజెపి అధ్యక్షుడు మంచి రాజేష్ కుమార్, ఆర్టికల్చర్ సూపర్వైజర్ అజయ్ కుమార్, కౌన్సిల్ మెంబర్ కాట విజయ గౌడ్, నాయకులు శివరాజ్ పాటిల్, తిరుమల, నాగు, సుధాకర్, దిలీప్ కుమార్, ధీరజ్, శ్రీధర్, నటరాజు, రవీందర్, కోటగిరి శ్రీనివాసరావు, రవి చారి, నరేష్, సత్య నగర్ సంక్షేమ సంఘం కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ స్థలాన్ని కాపాడండి..

- విలువైన 11 ఎకరాల స్థలాన్ని కాజేసిన కబ్జాకోరులు
- ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన మన్నే గోవర్ధన్ రెడ్డి..



హైదరాబాద్, ఆగస్టు 09 (జర్నలిస్ట్ ఫైల్) : ఖైరతాబాద్ నియోజకవర్గం వెంకటేశ్వర కాలనీ డివిజన్ పరిధిలోని బంజారాహిల్స్ రోడ్ నంబర్ - 10లో జలమండలి కార్యాలయం పక్కన ఉన్న సుమారు 11 ఎకరాల విలువైన ప్రభుత్వ స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడాలని ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన పార్టీ నాయకులతో కలిసి ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని డంపింగ్ చేయడంతో పాటు చెట్లను నరికివేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూమిలో అక్రమంగా మట్టి పోస్తూ, చెట్లను తొలగిస్తున్న వారిపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. బంజారాహిల్స్ వంటి అత్యంత విలువైన ప్రాంతంలో ఉన్న 11 ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతున్నా సంబంధిత రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు ఎందుకు స్పందించడం లేదని మన్నె గోవర్ధన్ రెడ్డి ప్రశ్నించారు. ప్రభుత్వ భూములను రక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్తులో మరిన్ని అక్రమాలకు అవకాశం ఏర్పడుతుందని హెచ్చరించారు. ప్రభుత్వ స్థలాన్ని వెంటనే గుర్తించి "ఇది ప్రభుత్వ భూమి" అని స్పష్టంగా తెలియజేసే బోర్డును ఏర్పాటు చేయాలని, అక్రమ మట్టి డంపింగ్‌ను తక్షణమే నిలిపివేయాలని కోరారు. అలాగే చెట్ల నరికివేతపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములను కాపాడటంలో అధికారులు కఠినంగా వ్యవహరించాలని, విలువైన ప్రభుత్వ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు వెంకీ ముదిరాజ్, నవీన్ నాయక్, సంతు ముదిరాజ్, శౌరి రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగులకు 'కృత్రిమ' అవయవాలు అందజేత



మణికొండ, ఆగస్టు 09 (జర్నలిస్ట్ ఫైల్) : వికలాంగుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపేందుకు మణికొండలో మానవతా కార్యక్రమం నిర్వహించారు. భారత్ వికాస్ పరిషత్, సీనియర్ సిటిజన్ సొసైటీ ఆఫ్ మణికొండ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 25 మంది వికలాంగులకు కృత్రిమ అవయవాలను అమర్చారు. ఈసందర్భంగా సీనియర్ సిటిజన్ సొసైటీ ఆఫ్ మణికొండ జనరల్ సెక్రటరీ రఘు సతీష్ కుమార్ మాట్లాడుతూ వికలాంగులకు కృత్రిమ అవయవాలు అందించడం కేవలం ఒక పరికరం ఇవ్వడం కాదని, ఒక వ్యక్తికి మళ్లీ నడిచే అవకాశం, వ్యక్తికి ఆత్మ విశ్వాసం కల్పించడం అని పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా వైస్ ప్రెసిడెంట్ కొడకండ్ల నరేందర్ రెడ్డి, మణికొండ బీజేపీ అధ్యక్షుడు రవికాంత్ రెడ్డి మాట్లాడుతూ శారీరక వైకల్యం ఉన్నప్పటికీ వారి ధైర్యం, పట్టుదల, ప్రతిభను ఎవరు అడ్డుకో లేరన్నారు. వైకల్యం ఒక మనిషి సామర్థ్యానికి కొలమానం కాదని చెప్పారు. వికలాంగులను జాలితో కాకుండా గౌరవంతోచూడాలనిసూచించారు. వారికివిద్య,ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలతో పాటు ప్రజా ప్రదేశాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. అనంతరం సుమారు 150 మందికి భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా మహిళా వైస్ ప్రెసిడెంట్ ఇందిరా రెడ్డి, రఘు సతీష్ కుమార్, ఆల్ కాలనీస్ వైస్ ప్రెసిడెంట్ రాజశేఖర్, సీనియర్ సిటిజన్ ఫౌండర్ రామానుజన్, జిజాబాయి బ్రాంచ్ అధ్యక్షుడు పెంటా రెడ్డి, బీవీపీ రీజనల్ జాయింట్ సెక్రటరీ నాగరాజు, సంపర్క్ కన్వీనర్ సదాశివ రెడ్డి, కార్యదర్శి వినోద్, బీరప్ప, సిద్ధప్ప, రాజేష్, మధు, వెంకటాచారి, శివకుమార్, సీనియర్ సిటిజన్ అధ్యక్షుడు ప్రభూజీ, మహిళా సంపర్క్ సత్యవతి, కమల కుమారి, హరిప్రియ పాల్గొన్నారు.

# అన్నాస్‌పల్లి గ్రామంలో ఆరోగ్య సేవలు

- చిన్నారులకు టీకాలు.. వృద్ధులకు ఫీవర్ టెస్టులు,మందుల పంపిణీ
- అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ నేనావత్ శ్రీను నాయక్ సూచన



కడ్తాల్ ఆగస్టు 09 (జర్నలిస్ట్ ఫైల్) : రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలంలోని అన్నాస్‌పల్లి గ్రామంలో ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో ప్రత్యేక ఆరోగ్య కార్యక్రమాన్ని నిర్వహించారు.గ్రామంలోని చిన్నారులు, వృద్ధుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి వైద్య సేవలు అందించారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఐదేళ్ల వయసు వరకు ఉన్న చిన్నారులకు అవసరమైన టీకాలు వేశారు.చిన్నారులకు సకాలంలో టీకాలు వేయించడం ద్వారా వివిధ రకాల వ్యాధుల నుంచి రక్షణ కల్పించవచ్చని ఆరోగ్య సిబ్బంది తెలిపారు.తల్లిదండ్రులు తమ పిల్లలకు ప్రభుత్వం సూచించిన టీకాలను తప్పనిసరిగా వేయించాలని సూచించారు. అదేవిధంగా గ్రామంలోని వృద్ధులకు ఫీవర్ టెస్టులు నిర్వహించి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు.జ్వరం,జలుబు,దగ్గు తదితర లక్షణాలు ఉన్నవారికి పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు.వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆరోగ్య సిబ్బంది సూచించారు.ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడంతో పాటు దోమల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.జ్వరం లేదా ఇతర అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నేనావత్ శ్రీను నాయక్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వర్షాకాలంలో వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.చిన్నారులకు టీకాలు సకాలంలో వేయించడంతో పాటు వృద్ధులు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు.గ్రామస్థుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని గ్రామస్థులు పేర్కొన్నారు.చిన్నారులకు టీకాలు,వృద్ధులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన మందులు అందించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం రమాదేవి,అంగన్‌వాడీ టీచర్ కాంచనమాల,ఆశా వర్కర్ యాదమ్మ,వార్డు సభ్యులు రేణుక,రామావత్ దేవులతో పాటు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మర్రిచెట్టు దగ్గర ఉన్న శివాలయానికి గోశాల విరాళం




మణికొండ, ఆగస్టు 09 (జర్నలిస్ట్ ఫైల్) : ఆర్య వైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ పుప్పాలగూడ యూనిట్ సభ్యులందరూ కలిసి మర్రిచెట్టు శివాలయానికి సంబంధించిన గోశాల విరాళాల మొత్తం రూ. 51,116 చెక్కును శనివారం శివాలయం పంతులు మల్లికార్జున శర్మకి, టెంపుల్ ఫైనాన్షియల్ సెక్రటరీ రాఘవరెడ్డికి అందజేశారు. ఈ మొత్తం అమౌంట్ ఆవోపా పుప్పాలగూడ సభ్యుల తరఫున సేకరించబడిందన్నారు. ఈ కార్యక్రమంలో ధారం భానుచందర్, పబ్బ మల్లేశం, గూడేటి బాలస్వామి, బూరుగు సాయిబాబా, హనుమంతు రాయ్, పందిరి కృష్ణ, ధారం వేణుమాధవ్ పుప్పాలగూడ శాఖ అధ్యక్షులుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఇంత విరాళం సేకరించినటువంటి వేణుమాధవ్ గారిని రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బొడ్డు శ్రీధర్ రాష్ట్ర అధ్యక్షులు మల్లిపెద్ది శంకర్ అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దారం వేణు మాధవ్, అధ్యక్షుడు, అవోపా పుప్పలగూడ యూనిట్,దారం భానుచందర్, ప్రధాన కార్యదర్శి అప్పాని యుగేందర్, కోశాధికారి, అవోపా పుప్పాలగూడ యూనిట్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లంపేట్‌ను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం: చైర్‌పర్సన్ శ్రీదేవి

### రూ.10 లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



మేడ్చల్, ఆగస్టు 09 (జర్నలిస్ట్ ఫైల్) : ఎల్లంపేట్ మున్సి పాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే పాలకవర్గం ప్రధాన లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ లావుడ్యా శ్రీదేవి రమేష్ తెలిపారు. శనివారం ఎల్లంపేట్ పురపాలక సంఘం పరిధిలోని 9వ వార్డు సైదోనిగడ్డ తాండా వార్డులో సుమారు రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు చైర్‌పర్సన్ లావుడ్యా శ్రీదేవి రమేష్ స్థానిక కౌన్సిలర్ మలోత్ రజిత రాజేందర్ నాయక్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ శ్రీదేవి రమేష్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు పాలకవర్గం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ప్రతి వార్డులో ప్రజల అవసరా లను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతు న్నామని తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు పారిశుద్ధ్యం, తాగునీరు, అంతర్గత రహదారులు, వీధి దీపాలు తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని ఆమె పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని, అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మున్సిపాలిటీ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో ముఖ్యమని, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే మరింత వేగంగా అభివృద్ధి సాధించవచ్చన్నారు. ఎల్లంపేట్ మున్సిపాలిటీని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసి ప్రజలకు సౌకర్యవంతమైన, పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించేందుకు కృషి చేస్తున్నామని చైర్‌పర్సన్ తెలిపారు. రానున్న రోజుల్లో మున్సిపాలిటీ పరిధిలో మరిన్ని అభివృద్ధి పనులను చేపట్టి ప్రతి వార్డును సమగ్రంగా అభివృద్ధి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు మలోత్ రజిత రాజేందర్ నాయక్, వరలక్ష్మి సురేందర్, అర్చన శ్రీనివాస్, స్థానిక నాయకులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## అల్కాపూర్ టౌన్‌షిప్‌లో ఉచిత రేబీస్ నిరోధక టీకాల పంపిణీ




మణికొండ, ఆగస్టు 09 (జర్నలిస్ట్ ఫైల్) : మూగజీవాల రక్షణే ధ్యేయంగా "బ్లూ క్రాస్" స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నెక్నాంపూర్ డివిజన్, అల్కాపూర్ టౌన్‌షిప్‌లోని స్వామి వివేకానంద పార్క్ వద్ద ఉచిత వ్యాక్సినేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్లలో పెంచుకునే కుక్కలతో పాటు అపార్ట్‌మెంట్లు, వీధుల్లో ఉండే కుక్కలకు కూడా ఉచితంగా రేబీస్ నిరోధక టీకాలు వేయనున్నారు. పెంపుడు కుక్కల యజమానులు, కాలనీ వాసులు మరియు జంతు ప్రేమికులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని, వీధి కుక్కలకు కూడా టీకాలు వేయించి వాటిని వ్యాధుల నుండి కాపాడాలని బ్లూ క్రాస్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

# మేకల శ్రీనివాస్‌పై దాడి ఆరోపణలు..

- ఎస్సై సహా పోలీసులపై చర్యలు తీసుకోవాలి
- భూ వివాదంలో శ్రీనివాస్‌పై దాడి ఎస్సై భరత్ భూషణ్‌పై చర్యలు తీసుకోవాలి
- సీపీఎం, సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ, రైతు సంఘాల నాయకుల డిమాండ్



వికారాబాద్, ఆగస్టు 09 (జర్నలిస్ట్ ఫైల్) : వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన మేకల శ్రీనివాస్‌పై పోలీసులు విచక్షణారహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని ఆరోపిస్తూ, మోమిన్‌పేట్ ఎస్సై భరత్ భూషణ్‌తో పాటు నలుగురు పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం, సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ, రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.వికారాబాద్ పట్టణంలోని నరేష్ అడ్వాన్స్‌డ్ న్యూరో హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న మేకల శ్రీనివాస్‌ను సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్. మహిపాల్, న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి వై. మహేందర్, రైతు సంఘం నాయకులు, కుటుంబ సభ్యులు పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. భూ వివాదానికి సంబంధించిన కేసులో శ్రీనివాస్‌ను అక్రమంగా అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచిన అనంతరం జైలుకు తరలించే సమయంలో పోలీసులు తీవ్రంగా కొట్టారని ఆరోపించారు.బూరుగుపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 68లో 2.15 ఎకరాలు, సర్వే నంబర్ 75లో 4.20 ఎకరాల భూములకు సంబంధించి వివాదం కొనసాగుతోందని నాయకులు తెలిపారు. భూముల ఆక్రమణను శ్రీనివాస్ అడ్డుకున్నందుకే అతనిపై కేసులు పెట్టి పోలీసుల ద్వారా దాడి చేయించారని ఆరోపించారు.కోర్టులో హాజరుపరిచిన అనంతరం వికారాబాద్ నుంచి పరిగి జైలుకు తరలించే సమయంలో కూడా శ్రీనివాస్‌పై పోలీసులు దాడి చేశారని వారు ఆరోపించారు. ఈ ఘటనపై ఎస్సై భరత్ భూషణ్‌తో పాటు హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లు, డ్రైవర్ అరుణ్ కుమార్‌పై హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా భూ వివాదానికి కారణమైనట్లు ఆరోపిస్తున్న మంతనకాడి కృష్ణంరాజు, మంతనకాడి విక్రమ్ రాజులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. శ్రీనివాస్‌కు మెరుగైన వైద్యం అందించి, ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.తమ డిమాండ్లపై ప్రభుత్వం, పోలీసు ఉన్నతాధికారులు వెంటనే స్పందించకపోతే ఎస్పీ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని సీపీఎం, న్యూ డెమోక్రసీ నాయకులు హెచ్చరించారు.



**మోమిన్ పేట్ ఇన్స్పెక్టర్ వివరణ..**

మోమిన్ పెట్ మండల్ బురుగుపల్లి గ్రామానికి చెందిన మేకల శ్రీనివాస్‌పై పోలీసులు దాడి చేశారంటూ వస్తున్న ఆరోపణలను మోమిన్‌పేట్ సీఐ వెంకట్ ఖండించారు. శ్రీనివాస్‌ను వికారాబాద్ పోలీస్ స్టేషన్‌కు వేలిముద్రల సేకరణ కోసం మాత్రమే తీసుకొని వచ్చారని ఆయన స్పష్టం చేశారు. ఏదైనా కేసులో నిందితుడిని కోర్టులో హాజరుపరిచిన అనంతరం, కేసుకు సంబంధించిన అంశాలపై పోలీస్ స్టేషన్‌లో విచారణ చేయడం, ఇంటరాగేషన్ నిర్వహించడం లేదా కేసు విషయాలను మాట్లాడటం వంటివి జరగవని సీఐ తెలిపారు. శ్రీనివాస్‌పై పోలీసులు దాడి చేశారన్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని పేర్కొన్నారు.పోలీసులు శ్రీనివాస్‌ను కొట్టి చంపేందుకు ప్రయత్నించారన్న సోషల్ మీడియాలో వస్తున్న వాట్సాప్ గ్రూప్‌లో వస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని, కట్టు కథలతో కూడిన ఆరోపణలని సీఐ వెంకట్ అన్నారు. వాస్తవాలను పరిశీలించకుండా ఆరోపణలు చేయడం సరికాదని ఆయన స్పష్టం చేశారు.

## చిలుకూరు గురుకుల పాఠశాలలో నూతన పేరెంట్స్ కమిటీ ఎన్నిక

### - విద్యార్థుల భవిష్యత్తు కోసం పేరెంట్స్ కమిటీ సహకరించాలి



శంకర్ పల్లి ఆగస్టు 09 (జర్నలిస్ట్ ఫైల్) : చిలుకూరు గురుకుల బాలుర పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ శౌరి రాజు విద్యార్థుల ఉజ్వలా భవిష్యత్తు కోసం పేరెంట్స్ కమిటీ అన్ని విధాలుగా సహకరించాలన్నారు. శనివారం రోజు మొయినాబాద్ మున్సిపాలిటీ చిలుకూరు లో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర,పాఠశాల కళాశాల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు ఈ సందర్భంగా తెలంగాణ గురుకుల పాఠశాల కళాశాల ప్రిన్సిపల్ శౌరి రాజు చిలుకూరు గురుకుల పాఠశాల కళాశాల మాజీ చైర్మన్ బేగరి రాజు మాట్లాడుతూ...గత 40 సంవత్సరాల క్రితం ఎస్ ఆర్ శంకర్ స్థాపించిన గురుకుల పాఠశాలలో చదువుతున్న బడుగు బలహీన వర్గాల విద్యార్థులు విద్యకు దూరం కాకూడదని ఆలోచనతో ఆ రోజుల్లో ఉన్నటువంటి ప్రభుత్వాలు ఉన్నతమైనటువంటి ఆలోచనతో గురుకుల పాఠశాలలో నెలకొల్పారన్నారు. నేడు గురుకుల పాఠశాలలో ప్రైవేటు కళాశాలతో దీటుగా పోటీ పడుతున్నాయని ఎంతోమంది పేద విద్యార్థులు డాక్టర్లు ఇంజనీర్లుగా తయారవుతున్నారని అన్నారు.ఇలాంటి గురుకుల పాఠశాలలో బడుగు బలహీన వర్గాల పిల్లలకు ఎంతో శ్రోధ పడుతుందని అన్నారు.ఈ సందర్భంగా నూతన కార్యవర్గం అధ్యక్ష కార్యదర్శులు నక్క మాణిక్యం,వెంకటేశ్వర్లు, దిలీప్,ప్రధాన కార్యదర్శి జి శ్యామలయ్య,సహాయ కార్యదర్శి మల్లేశం, కోశాధికారి శ్రీకాంత్,కార్యవర్గ సభ్యులు బి శ్రీనివాస్,శ్వేత, పాడు,రాజేందర్,వెంకటేష్, విజయ్ భాస్కర్,గజేందర్, సురేష్,రాజు,ఆంజనేయులు, శివ శంకర్ పాల్గొన్నారు.

# హాస్టళ్లలో మెనూ మాయం.. నాణ్యత లేని భోజనం

- వార్డెన్ల నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలి
- ఆకస్మిక తనిఖీలు చేపట్టాలి.. ఆర్ఓ ప్లాంట్లను అందుబాటులోకి తేవాలి
- ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ దిగంబర్

**నిర్మల్ జిల్లా, ఆగస్టు 09 (జర్నలిస్ట్ ఫైల్) :**

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ విద్యార్థి వసతి గృహాల్లో విద్యార్థుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తున్న వార్డెన్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ దిగంబర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను అమలు చేయని వార్డెన్లను వెంటనే విధుల నుంచి తొలగించాలని కోరారు. విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం, రక్షిత మంచినీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా దిగంబర్ మాట్లాడుతూ.. జిల్లాలోని పలు వసతి గృహాల్లో విద్యార్థులకు కనీస సౌకర్యాలు సక్రమంగా అందడం లేదని ఆరోపించారు. మెనూ ప్రకారం భోజనం అందించకుండా నాణ్యత లేని ఆహారం పెడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన భోజనం అందించేలా పర్యవేక్షణ పెంచాలని కోరారు. మెనూ పాటించని వార్డెన్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు చేయాలి:**

జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని ప్రభుత్వ వసతి గృహాల్లో ముందస్తు సమాచారం లేకుండా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని దిగంబర్ కోరారు. ఉన్నతాధికారులు తనిఖీలకు వస్తున్న విషయం ముందుగానే తెలియడంతో కొన్ని చోట్ల వార్డెన్లు అప్రమత్తమై లోపాలను కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఆకస్మిక తనిఖీల ద్వారానే హాస్టళ్లలోని వాస్తవ పరిస్థితులు వెలుగులోకి వస్తాయని పేర్కొన్నారు.

**ఆర్ఓ ప్లాంట్లు వినియోగించాలి:**

వర్షాకాలంలో భూగర్భ జలాలు కలుషితమయ్యే అవకాశం ఉన్నందున విద్యార్థులకు శుద్ధి చేసిన తాగునీరు అందించాలని కోరారు. కొన్ని వసతి గృహాల్లో ఆర్ఓ ప్లాంట్లు ఉన్నప్పటికీ వాటిని వినియోగించకుండా విద్యార్థులకు నాణ్యత లేని నీటిని అందిస్తున్నట్లు ఆరోపించారు. ఆర్ఓ ప్లాంట్లను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చి, విద్యార్థులకు రక్షిత మంచినీరు అందించాలని డిమాండ్ చేశారు.

**తనిఖీలు నామమాత్రంగా ఉండొద్దు:**

అధికారుల తనిఖీలు కేవలం రికార్డులకే పరిమితం కాకుండా చిత్తశుద్ధితో జరగాలని దిగంబర్ అన్నారు. హాస్టళ్లలో భోజనం



నాణ్యత, మెనూ అమలు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యార్థులకు అందుతున్న ఇతర సౌకర్యాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కోరారు. లోపాలు గుర్తించిన వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకుని విద్యార్థులకు మెరుగైన వసతి, ఆహారం, తాగునీరు అందేలా చూడాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ దిగంబర్ డిమాండ్ చేశారు.

## మారు పేర్ల విజిలెన్స్ బాధితుల

# నిరసన దీక్షలో బిక్షాటన




**రామ్ మందిర ఏరియా, ఆగస్టు 09 (జర్నలిస్ట్ ఫైల్) :**

మా ఉద్యోగాలు మాకు ఇవ్వండి.. అంటూ మారు పేర్ల విజిలెన్స్ బాధితుల ఆవేదన(మా ఉద్యోగాలు మాకు ఇప్పించాలని కోరుతూ మారుపేర్ల విజిలెన్స్ బాధితులు ఆర్జీ 1జీఎం కార్యాలయం ముందు చేపట్టిన నిరసన దీక్షలో రెండవరోజు వినూత్నంగా బిక్షాటన చేపట్టారు. తమ ఉద్యోగాలను తిరిగి ఇప్పించాలని కోరుతూ బాధితులు నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. తమకు న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. తమ ఉద్యోగాలను తమకు తిరిగి ఇప్పించాలని ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

# ఆర్జీ-1 ఏరియా పర్సనల్ మేనేజర్‌గా తిరుపతి బాధ్యతల స్వీకరణ

## స్కౌట్స్ అండ్ రోవర్స్ ఆధ్వర్యంలో ఘన సన్మానం

**రామ్ మందిర ఏరియా, ఆగస్టు 09 (జర్నలిస్ట్ ఫైల్) :**

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఆర్జీ-1 ఏరియా నూతన పర్సనల్ మేనేజర్‌గా రెడ్డిమల్ల తిరుపతి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్జీ-1 స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు చెందిన రోవర్ స్కౌట్స్ ఆధ్వర్యంలో జీఎం కార్యాలయంలో ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు.ఇటీవల సూపర్ బజార్‌లో డివిజనల్ మేనేజర్‌గా విధులు నిర్వహించిన తిరుపతి బదిలీపై ఆర్జీ-1 ఏరియా పర్సనల్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పర్సనల్ అధికారులు నాగుల వేణు, శ్రవణ్ కుమార్, ఫిరోజ్ ఖాన్, హనుమంతరావు తదితరులు నూతన పర్సనల్ మేనేజర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఆర్జీ-1 స్కౌట్ మాస్టర్లు కుందూరు బుచ్చయ్య, దొడ్డి కుమార్, గుంటి కుమార్, అంజయ్య, సతీష్ తదితరులు రెడ్డిమల్ల తిరుపతిని శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సంక్షేమ అధికారులు,



స్కౌట్స్ అండ్ రోవర్స్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**తాండూర్, ఆగస్టు 09 (జర్నలిస్ట్ ఫైల్) :**



తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందినట్లు ఎస్ఐ ప్రసాద్ రావు తెలిపారు. మండలంలోని రేచిని గ్రామానికి చెందిన గోగర్ల ప్రవీణ్(26) తాండూర్ ఐబి నుండి మోటారు బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా ఎన్టీఆర్ కాలనీ దాటిన తర్వాత రోడ్డుపైకి గేదె అడ్డు రావడంతో అదుపు తప్పి కింద పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికులు 108 అంబులెన్స్‌లో బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ప్రవీణ్ మృతి చెందాడు. అనంతరం శవపంచనామా కోసం మృతదేహాన్ని తిరిగి బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి గోగర్ల రాజయ్య ఫిర్యాదు మేరకు తాండూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు ప్రవీణ్ ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. అతనికి ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపారు.

# రాజీనామా బాటలో మున్సిపల్ కౌన్సిలర్లు ?

- అధికారుల తీరుపై కౌన్సిలర్ల అసంతృప్తి
- వార్డుల్లో అభివృద్ధి పనులు నిలిచిపోయాయంటూ ఆవేదన
- శానిటేషన్, చెత్త సేకరణపై తీవ్ర అసహనం
- కౌన్సిలర్లుగా మమ్మల్ని అధికారులు లెక్క చేయడం లేదు

**జగిత్యాల జిల్లా, ఆగస్టు 09 (జర్నలిస్ట్ ఫైల్) :**

జగిత్యాల పట్టణ బల్దియాకు ఎన్నికలు జరిగి కొత్త పాలకవర్గం కొలువుదీరి ఆరు నెలలు కూడా పూర్తికాకముందే మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్ల మధ్య విభేదాలు తలెత్తినట్లు తెలుస్తోంది. తమ వార్డుల్లో అభివృద్ధి పనులు జరగడం లేదని, అధికారులు తమ మాటలను పట్టించుకోవడం లేదని పలువురు కౌన్సిలర్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం.ముఖ్యంగా శానిటేషన్ సిబ్బంది సక్రమంగా వార్డులకు రావడం లేదని, చెత్త సేకరణ వాహనాలు ప్రతిరోజూ రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. వార్డుల ప్రజలకు అవసరమైన పలు మున్సిపల్ సేవలు, ముఖ్యంగా మోటేషన్ పనులు, పేరు లో సవరణలు, టాక్స్ రివిజన్, లకు అధికారుల సహకారం లేకపోవడంతో చేయలేకపోతున్నామని వారు వాపోతున్నట్లు సమాచారం.ఇటీవల కురిసిన వర్షాలతో పలు వార్డుల్లో నీరు నిలిచి, మురుగు కాలువలు చెత్తతో నిండిపోయినప్పటికీ వాటిని శుభ్రం చేసేందుకు సిబ్బందిని పంపాలని పలుమార్లు కోరినా స్పందన అంతంతమాత్రంగానే ఉందని కౌన్సిలర్లు లోలోపల మదనపడుతున్నట్లు తెలుస్తోంది.గతంలోనూ ఇదే అంశంపై కౌన్సిలర్లు తమ అసంతృప్తిని వ్యక్తం చేయగా, మున్సిపల్ చైర్‌పర్సన్ వారితో మాట్లాడి అధికారులు పనులు సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని, తొందరపడి ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని సూచించినట్లు సమాచారం. అయితే పరిస్థితిలో పెద్దగా మార్పు కనిపించడం లేదని కొందరు కౌన్సిలర్లు భావిస్తున్నట్లు తెలుస్తోంది.జగిత్యాల పట్టణంలో కౌన్సిలర్లకు ప్రాధాన్యత లభించడం లేదనేది ఒకవైపు అయితే మరోవైపు మైనార్టీ వార్డులలో కౌన్సిలర్లుగా గెలిచినవారు తీవ్ర వివక్షకు గురవుతున్నామని బాధపడుతున్నారు..ఎన్నికల్లో మాపై పోటీ చేసి ఓడిపోయిన వారికి




వార్డుపనులలో అధికారులు ప్రాధాన్యత ఇస్తున్నారని ఓడిన అభ్యర్థులు మాకు అగ్రశ్రేణి నాయకుల అండ ఉందని వార్డులో మామటే చెల్లుబాటు అవుతుందని అంటున్నట్లు తెలుస్తోంది..
ఉదాహరణకు వార్డులలో ఇచ్చిన ఎలక్ట్రిక్ వాహనాల విషయంలో ఓ కౌన్సిలర్ ప్రతిపాదించిన వారికి కాకుండా అతని చేతిలో పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థి ప్రతిపాదించిన వారికి మంజూరైనట్లు విశ్వాసనీయ సమాచారం.."వార్డుల్లో ప్రజలకు మేమేం సమాధానం చెప్పాలి? అధికారులు సహకరించకపోతే కౌన్సిలర్‌గా ఉండి ప్రయోజనం ఏమిటి?"అంటూ కొందరు కౌన్సిలర్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లుగా పరిస్థితి ఇలాగే కొనసాగితే కౌన్సిలర్ పదవులకు రాజీనామా చేయడమే మేలనే ఆలోచనలో కొందరు ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.అయితే ఈ రాజీనామా అంశం ఎంతవరకు కార్యరూపం దాల్చుతుందో వేచి చూడాల్సి ఉంది. అధికారులుకౌన్సిలర్ల మధ్య నెలకొన్న ఈ అంతర్గత ఆధిపత్య పోరు చివరకు ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందో జగిత్యాల లో ఆసక్తికరంగా మారింది.

# స్వీట్లపై 'బెస్ట్ బిఫోర్' తేదీ తప్పనిసరిగా చూపాలి



**జగిత్యాల, ఆగస్టు 09 (జర్నలిస్ట్ ఫైల్) :**

స్వీట్ల విక్రయాల్లో 'బెస్ట్ బిఫోర్' తేదీని తప్పనిసరిగా ప్రదర్శించే నిబంధనలను దేశవ్యాప్తంగా కఠినంగా అమలు చేయాలని లింకా బుక్ ఆఫ్ రికార్డ్స్ గ్రహీత, సామాజికవేత్త బాస ప్రకాష్ కోరారు. శుక్రవారం జగిత్యాల ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.2020 సెప్టెంబర్ 25న ఎఫ్ఎస్ఎస్ఏఐ జారీ చేసిన నిబంధనల ప్రకారం స్వీట్లపై వినియోగదారులకు స్పష్టంగా 'బెస్ట్ బిఫోర్' తేదీని తెలియజేయాల్సి ఉందన్నారు. నిబంధనలు పాటించని స్వీట్ షాపులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్2006 ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.వినియోగదారుల ఆరోగ్యం, భద్రత కోసం నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు.

# ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా మర్రిపెల్లి సత్యమ్

**పెగడపల్లి, ఆగస్టు 09 (జర్నలిస్ట్ ఫైల్) :**

భారతీయ జనతా పార్టీ అనుబంధ విభాగం ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నంచర్ల గ్రామానికి చెందిన న్యాయవాది మర్రిపెల్లి సత్యమ్ ను నియమించినట్లు బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర శాఖ అధ్యక్షుడు గంధం వల్ల ఆనంద్ గౌడ్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మరిపెల్లి సత్యమ్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ విస్తరణకు తన వంతు కృషి చేస్తానని నన్ను రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమించిన రాష్ట్ర శాఖ అధ్యక్షులు ఆనంద గౌడ్ కు ధన్యవాదాలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షులు రాచకొండ యాదగిరి బాబుకు నాయకులు కన్నం అంజయ్య గుజ్జుల వేణుగోపాల్ రెడ్డి కు కృతజ్ఞతలు తెలియజేశారు.మర్రిపెల్లి సత్యమ్ నియామకం పట్ల మండల అధ్యక్షులు పల్లె మోహన్ రెడ్డి ప్రధాన కార్యదర్శులు కొత్తూరు బాబు కోట మల్లేష్ బీజేవైఎం మండల అధ్యక్షులు జక్కుల హరీష్ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు కూన కుమార్ గిరిజన మోర్చా అధ్యక్షులు అజ్మీర ఇంద్రా నాయక్ తడగొండ అంజన్న, కూనసాగర్,నేదరి సాయి కృష్ణ, పెద్ది రాకేష్, శ్రీరామ్,మంత్రి మల్లేష్, రాయుడు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



# నంచర్ల ప్రాథమిక పాఠశాల లో ఘనంగా బోనాల పండుగ వేడుకలు




**పెగడపల్లి, ఆగస్టు 09 (జర్నలిస్ట్ ఫైల్) :**


జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం నంచర్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల లో బోనాల పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదవ తరగతి తెలుగులో పాఠ్యాంశమైన తెలంగాణ రాష్ట్ర బోనాల పండుగ విశిష్టతను విద్యార్థులు శాఖ, ఊరడి, రంగస్థలం వేషధారణ రూపకంగా తెలియజేయడం జరిగిందని వర్షాలు బాగా పడాలని, ప్రజలందరూ ఆరోగ్యం బాగుండాలని పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని కోరుకుంటూ చేసే పండుగని ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బివి సుబ్బారావు, ఉపాధ్యాయులు సబితా, స్వప్న, సాగర్, రాజు, హేమలత, శ్రావ్య తదితరులు పాల్గొన్నారు.

# అవి కూల్చివేతలు కాదు.. అక్రమ నిర్మాణాల తొలగింపులు

## - కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు మెంటం ఉదయరాజు

**రామ్ మందిర ఏరియా, ఆగస్టు 09 (జర్నలిస్ట్ ఫైల్) :**

ఖని ఎల్‌బీనగర్‌లో అక్రమంగా నిర్మించిన దుకాణాలను మున్సిపల్, సింగరేణి అధికారులు తొలగించడాన్ని కూల్చివేతలుగా చిత్రీకరిస్తూ కొందరు చేస్తున్న ఆరోపణలను కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు మెంటం ఉదయరాజు తీవ్రంగా ఖండించారు. అక్రమ నిర్మాణాల తొలగింపుపై రాజకీయ ఆరోపణలు చేయడం సరికాదన్నారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్‌బీనగర్ కూడలి విస్తరణ కోసం గతంలో ఆర్జీలు పెట్టిన వారే ఇప్పుడు అక్రమ నిర్మాణాల తొలగింపును కూల్చివేతలుగా పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. అధికారులు అక్రమ నిర్మాణాలను తొలగించే సమయంలో అసలు బాధితులు ఎవరూ అడ్డుకోలేదని, కొందరు మధ్యవర్తులే దీనిని రాజకీయంగా వివాదాస్పదం చేస్తున్నారని ఆరోపించారు.అక్కడ 12 షాపులు



నిర్మిస్తున్నట్లు చెబుతున్న వారు నిజంగా లబ్ధిదారులు అయితే, ఒక్కో 10ఐ12 అడుగుల షాపుకు రూ.3.20 లక్షల చొప్పున మొత్తం రూ.38.40 లక్షలు వసూలు చేసినట్లు వస్తున్న ఆరోపణలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. షాపుల కోసం అడ్వాన్స్ చెల్లించి బాండ్ పేపర్లపై ఒప్పందాలు చేసుకున్న 12 మంది లబ్ధిదారుల పేర్లను అక్కడ ఏర్పాటు చేసిన బోర్డుపై బహిరంగంగా వెల్లడించాలని కోరారు. ఒక్క లబ్ధిదారుడి పేరు కూడా తక్కువగా ఉంటే అందుకు బాధ్యత ఎవరు వహిస్తారో స్పష్టం చేయాలని అన్నారు.
చిరు వ్యాపారులకు శాశ్వత నిర్మాణాలు కల్పించి వారి జీవనోపాధికి భరోసా కల్పించడంతో పాటు నగరాన్ని సుందరీకరించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు, వేం నరేందర్ రెడ్డి సహకారంతో ప్రత్యేక జీవో కోసం ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేస్తున్నారనే అక్కసుతో ఎమ్మెల్యేపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదన్నారు.గతంలో సింగరేణి భూముల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయంటూ ఇదే వ్యక్తులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ, ఇప్పుడు అదే అంశంలో ప్రశ్నలు ఎదురైనప్పుడు భిన్నంగా మాట్లాడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.కూల్చివేతల పేరుతో రాజకీయ ప్రయోజనాల కోసం ఎమ్మెల్యేను బదనాం చేయాలని ప్రయత్నిస్తున్న వారు ఎల్‌బీనగర్‌లో ఏర్పాటు చేసిన బోర్డుపై లబ్ధిదారుల పూర్తి వివరాలను వెల్లడించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని మెంటం ఉదయరాజు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అక్రమ నిర్మాణాలకు సంబంధించిన పూర్తి బాధ్యత వారే వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.
కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నమిండ్ల ఎల్లేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు కోల సుమంత్, చరణ్, ప్రసంగి, దినేష్, బాధితులు పూల భద్రయ్య, మొగిలితో పాటు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలను పరామర్శించిన మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు




**పెగడపల్లి, (జర్నలిస్ట్ ఫైల్) :**

జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం రాజారాంపల్లి గ్రామానికి చెందిన కోరే రామయ్య, బండారి పోచయ్య, ఇస్లావత్ లాలా నాయక్, పలు కారణాల చేత మరణించగా వారి కుటుంబాలను తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కడారి తిరుపతి ఆధ్వర్యంలో పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేయడం జరిగిందని తెలిపారు. వారి కుటుంబాలకు ప్రభుత్వం తరఫున అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి లక్ష్మణ్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లి వారికి ఇందిరమ్మ ఇల్లు కూడా ఇప్పిస్తామని తెలియజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇస్లావత్ రమేష్ నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులుఓరగల శ్రీనివాస్, సంధి మల్లారెడ్డి, పూసాల తిరుపతి, డైరెక్టర్లు విజయభాస్కర్, మహేష్, కిషన్, అంజి నాయక్, మాజీ సర్పంచ్ ఇస్లావత్ రవి నాయక్, రాజేందర్ రెడ్డి, శ్రీను, నరేష్, తిరుపతి, శేఖర్, రాజేష్ నాయక్, స్వామి, అశోక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పోశెట్టి కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నేతలు

**వెల్మల్, ఆగస్టు 09 (జర్నలిస్ట్ ఫైల్) :**

వెల్మల్ గ్రామానికి చెందిన కుందారం పోశెట్టి ఇటీవల మృతి చెందారు. ఇంటి పెద్దను కోల్పోయి శోకతప్తులై ఉన్న వారి కుటుంబ సభ్యులను శనివారం పలువురు ప్రముఖులు పరామర్శించారు. వారి నివాసంలో ఏర్పాటు చేసిన శ్రద్ధాంజలి కార్యక్రమంలో పోశెట్టి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ, కుందారం పోశెట్టి చాలా మంచి వ్యక్తి అని, గ్రామంలో అందరితో కలివిడిగా ఉండేవారని తెలిపారు. ఆయన మరణం కుటుంబానికి, గ్రామానికి తీరని లోటు అని, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దులకుంట సర్పంచ్ సతీష్ రెడ్డి, మాజీ సర్పంచులు శ్రీనివాస్ రెడ్డి, గంగారెడ్డి, కొండ రవి, నాయకులు, గ్రామ పెద్దలు, బంధువులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



# నేరాలకు స్వస్తి పలికి చట్టబద్ధ జీవనం సాగించాలి



## ○ రౌడీషీటర్లు, నేరచరిత్ర కలిగిన వారికి గుంటూరు పోలీసుల కౌన్సెలింగ్

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** నేరాలకు స్వస్తి పలికి చట్టాలను గౌరవిస్తూ బాధ్యతాయుతమైన పౌరులుగా జీవించాలని రౌడీషీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులకు గుంటూరు జిల్లా పోలీసులు సూచించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ఆదివారం జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులు, చెడు నడత కలిగిన వారికి ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు.

**గతాన్ని పక్కన పెట్టి మంచి మార్గంలో నడవాలి**

ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ గతంలో జరిగిన తప్పులను పక్కనపెట్టి ఇకపై చట్టాలను గౌరవిస్తూ సమాజంలో బాధ్యతాయుతంగా జీవించాలని సూచించారు. ఎలాంటి నేరాలకు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా కుటుంబ సభ్యులు, సమాజం గర్వించే విధంగా మంచి ప్రవర్తనతో మెలగాలని హితవు పలికారు.

**నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు**

ప్రజల ప్రశాంతతకు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించినా, నేరాలకు పాల్పడినా చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని పోలీసులు స్పష్టం చేశారు. రౌడీషీటర్లు, నేరప్రవృత్తి కలిగిన వ్యక్తుల కదలికలపై జిల్లా పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తున్నారని తెలిపారు.

**యువత చెడు మార్గాలకు వెళ్లకుండా అప్రమత్తత అవసరం**

నేరాలకు దూరంగా ఉంటూ చట్టబద్ధమైన జీవనం సాగించే వారికి పోలీసుల నుంచి అవసరమైన సహకారం అందిస్తామని అధికారులు తెలిపారు. యువత చెడు మార్గాలకు వెళ్లకుండా తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజల భద్రత, ప్రశాంతతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ నేర నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తున్నామని, శాంతియుత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరి సహకారం అవసరమని పోలీసులు పేర్కొన్నారు.

# ఆర్టీసీ ఉద్యోగుల ఉద్యమానికి మద్దతివ్వాలి



## ○ ఏపీ జేఏసీ చైర్మన్ కు ఆర్టీసీ ఉద్యోగ సంఘాల జేఏసీ విజ్ఞప్తి

**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఏపీపీటీడీ (ఆర్టీసీ) ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో చేపడుతున్న ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని ఏపీ జేఏసీ చైర్మన్, ఏపీ ఎన్జీవో సంఘాల రాష్ట్ర నాయకత్వాన్ని జేఏసీ నేతలు కోరారు. రెండు నెలలుగా శాంతియుతంగా ఆందోళనలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో మూడో దశ ఉద్యమాలకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు.

ఆదివారం విజయవాడలోని ఏపీ ఎన్జీవో హోమ్‌లో ఏపీ జేఏసీ చైర్మన్ ఏ. విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి ఏ. వి. రమణను ఆర్టీసీ జేఏసీ నాయకులు కలిసి తమ ఉద్యమానికి మద్దతు కోరారు.

ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ ఆర్టీసీలో విద్యుత్ బస్సుల ప్రవేశాన్ని ఉద్యోగ సంఘాలు స్వాగతిస్తున్నాయని తెలిపారు. అయితే విద్యుత్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆర్టీసీ సిబ్బందితో నిర్వహించాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. ఆర్టీసీ ప్రైవేటీకరణ జరగదన్న భరోసాను ఉద్యోగులకు ప్రభుత్వం కల్పించాలని అన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ కోసం జేఏసీ చేపట్టే ప్రస్తుత, భవిష్యత్ ఉద్యమాలకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు.

అనంతరం సీపీఐ కార్యాలయం దాసరి భవన్‌లో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జుల వలరాజు, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మొజ్జాడ యుగంధర్‌ను జేఏసీ నాయకులు కలిసి మద్దతు కోరారు. ఈ నెల 17, 18 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా 28 జిల్లాల్లోని 129 డిపోలలో నిర్వహించనున్న రెండు రోజుల సామూహిక నిరాహార దీక్షలకు, ఈ నెల 28న అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రజా రవాణా అధికారి (డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్) కార్యాలయాల వద్ద చేపట్టనున్న మహాధర్నాలకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్టీసీలో స్త్రీ శక్తి పథకం అమలుతో బస్సుల కొరత కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నేతలు పేర్కొన్నారు. బస్సుల సంఖ్యను పెంచడంతో పాటు యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఆర్టీసీలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ జేఏసీ ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ పలిశెట్టి దామోదరరావు, కో-కన్వీనర్లు పి. వి. రమణారెడ్డి, సి. హెచ్. సుందరయ్య, వై. శ్రీనివాసరావుతో పాటు జేఏసీ నాయకులు ఎం. డి. ప్రసాద్, ఆర్. సుబ్బారావు, ఎస్. రాజేష్‌కుమార్, ఎం. శంకరరావు తదితరులు పాల్గొన్నారు. సోమవారం కూడా ఆర్టీసీలోని వివిధ ఉద్యోగ సంఘాలు, ఇతర ట్రేడ్ యూనియన్ నాయకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులను కలిసి ఉద్యమానికి మద్దతు కోరనున్నట్లు జేఏసీ నాయకులు తెలిపారు.

# దశాబ్దాలు మారుతున్నా తరగని ఎన్టీఆర్ అభిమానం : కేంద్ర సహాయ మంత్రి డా. పెమ్మసాని

## ○ ప్రజల చిరకాల కోరికలు నెరవేర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** దశాబ్దాలు మారుతున్నా అన్న నందమూరి తారక రామారావుపై ప్రజల అభిమానం, తెలుగుదేశం పార్టీపై కార్యకర్తల నమ్మకం ఏమాత్రం తగ్గలేదని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి, గుంటూరు ఎంపీ డా. పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ప్రజల చిరకాల కోరికలను నెరవేర్చడంతో పాటు అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా ముందుకు తీసుకెళ్లడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

**పెన్షన్ డబ్బులతో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు**

సిరిపురం గ్రామంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆదివారం పెమ్మసాని చంద్రశేఖర్ ఆవిష్కరించారు. పెన్షన్ ద్వారా వచ్చిన డబ్బులతో ఎన్టీఆర్ విగ్రహానికి పునాది వేయడం ఆయనపై, తెలుగుదేశం పార్టీపై ప్రజలకు ఉన్న అపారమైన అభిమానానికి నిదర్శనమన్నారు. ఇలాంటి అభిమానంతో పనిచేసే కార్యకర్తలు టీడీపీకే సొంతమని పేర్కొన్నారు.

**రూ.3.80 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్**

సిరిపురంలో రూ. 3. 80 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు పెమ్మసాని శంకుస్థాపన చేశారు. ఈ సబ్‌స్టేషన్ ద్వారా సుమారు 7,000 నుంచి 8,000 కుటుంబాలతో పాటు ఏడు గ్రామాలకు విద్యుత్ ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. సబ్‌స్టేషన్ అందుబాటులోకి రావడంతో విద్యుత్ సరఫరా మెరుగుపడటంతో పాటు రైతులకు వోల్టేజ్ సమస్యలు తగ్గి నాణ్యమైన విద్యుత్ అందుతుందని చెప్పారు. మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించిన సమస్యలు కూడా తగ్గుతాయని పేర్కొన్నారు.

**కొండవీడు--పేరేచర్ల రహదారితో మెరుగైన రాకపోకలు**

కొండవీడు-పేరేచర్ల మధ్య నాలుగు లేన్ల రహదారి అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పెమ్మసాని తెలిపారు. పేరేచర్ల జంక్షన్ నుంచి ఐదో మైలు మీదుగా రాజధాని ప్రాంతానికి మెరుగైన రవాణా సదుపాయం అందుబాటులోకి వస్తుందని చెప్పారు. దీనివల్ల సిరిపురం, పరిసర ప్రాంతాల ప్రజలు అమరావతి ప్రాంతానికి ఉపాధి, ఇతర పనుల కోసం సులభంగా రాకపోకలు సాగించేందుకు అవకాశం కలుగుతుందన్నారు.

**సిరిపురం పెద్ద చెరువు అభివృద్ధి**

గుంటూరు పార్లమెంట్ పరిధిలోని పది నియోజకవర్గాల్లో ఈ ఏడాది పది చెరువులను అభివృద్ధి చేసేందుకు ఎంపిక చేసినట్లు పెమ్మసాని తెలిపారు. చెరువులను శుభ్రం చేసి వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లు, వ్యాయామ సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. వచ్చే ఏడాది మరో పది చెరువులను అభివృద్ధి చేయనున్నామని, వాటిలో సిరిపురం పెద్ద చెరువును కూడా చేర్చి ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు వాకింగ్, వ్యాయామ సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు.

**అమరావతి అభివృద్ధితో స్థానికులకు ఉపాధి**

అమరావతి చుట్టుపక్కల అనేక నిర్మాణాలు, ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని పెమ్మసాని అన్నారు. విద్యుత్, రహదారులు వంటి మౌలిక వసతులు మెరుగుపడితే చిన్న పరిశ్రమలు, వ్యాపారాలు ఏర్పడి స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. ప్రజలు కోరుతున్న రహదారుల అభివృద్ధి పనులను కూడా దశలవారీగా చేపడతామని హామీ ఇచ్చారు.

రాష్ట్ర విభజన అనంతరం 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం నిర్మించిన సిమెంట్ రోడ్లు ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో ప్రజలకు ఉపయోగపడుతున్నాయని పెమ్మసాని అన్నారు. గత ఐదేళ్లలో రహదారుల అభివృద్ధి తగిన స్థాయిలో జరగలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రహదారులు, విద్యుత్, చెరువులు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు.

సిరిపురం అభివృద్ధికి అవసరమైన పనులను దశలవారీగా పూర్తి చేస్తామని, ప్రజలు కోరుతున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. తనపై సిరిపురం ప్రజలు, టీడీపీ కార్యకర్తలు చూపిన అపూర్వమైన అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు.

# దాతల చేయూతను అందిపుచ్చుకోవాలి

## ○ విద్యార్థి దశలోనే లక్ష్యాలను ఏర్పరచుకోవాలి
## ○ ఎంపీ భాష్యం రామకృష్ణ, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** దాతల చేయూతను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. ఆదివారం ఫ్యాన్సీ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కొత్తపేటలోని ఫ్యాన్సీ కళ్యాణ మండపంలో 600 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, ఇద్దరికి స్కాలర్ షిప్ లు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీ భాష్యం రామకృష్ణ, ఎమ్మెల్యే నసీర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వారి చేతుల మీదుగా పుస్తకాలు, స్కాలర్ షిప్ లు పంపిణీ చేశారు. అనంతరం ఎంపీ భాష్యం రామకృష్ణ, ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ విద్యార్థులు ఎప్పటికప్పుడు పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యాభ్యాసం చేయాలని సూచించారు. ఫ్యాన్సీ మర్చంట్స్ అసోసియేషన్ విద్యార్థులకు చేయూతనివ్వడం అభినందనీయమని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో విద్యా వ్యవస్థను మెరుగుపరిచారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నారని, విద్యార్థుల చదువులకు భరోసా కల్పించేందుకు తల్లికి వందనం అందిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల ప్రారంభానికి ముందే పుస్తకాలు అందించారన్నారు. విద్యార్థులకు కేవలం చదువులే కాకుండా కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగుపరుచుకునేందుకు తగిన అవకాశాలు కల్పిస్తున్నారని చెప్పారు. విద్యార్థి దశలో ప్రతి చిన్న విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని, అవకాశాలను విజయాలుగా మలుచుకోవాలని సూచించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పిస్తున్నామని, విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రి అందిస్తున్నామని తెలిపారు. తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా ప్రాథమిక విద్యలో కీలక మార్పులు తీసుకొచ్చామన్నారు. పాఠశాలల్లో తాగు నీరు, మరుగుదొడ్లు, గ్రీన్‌బోర్డులు, డిజిటల్ తరగతి గదుల నిర్మాణం కోసం ప్రత్యేక నిధులు కేటాయించామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలపై ఆర్థిక భారం పడకుండా ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని కల్పించామన్నారు. కార్యక్రమంలో మిర్చియార్డు డైరెక్టర్ కొనకళ్ల సత్యం, అసోసియేషన్ ప్రెసిడెంట్ జుజ్జూరు శేష ప్రభాకరరావు, ప్రధాన కార్యదర్శి రంగా వెంకటరామకృష్ణ, ఉపాధ్యక్షులు వెంకటసుబ్బయ్య, అచ్యుత్ నిరంజన్, జీ రమేష్ కుమార్, వేమూరి వెంకట కామేశ్వరరావు, బచ్చు లక్ష్మీ శ్రీనివాసరావు, పీ వెంకటేశ్వర్లు, టీ దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.

# 12వ పీఆర్సీ కమిషన్ వెంటనే నియమించి ఐఆర్ ప్రకటించాలి

## ○ ఉద్యోగుల జీతాలపై అదనపు భారమనే ప్రచారం సరికాదు
## ○ ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్



**నెల్లూరు (జర్నలిస్ట్ ఫైల్) :** ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, తక్షణమే 12వ వేతన సవరణ సంఘం (పీఆర్సీ) కమిషన్‌ను నియమించి మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించాలని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు ఎ. విద్యాసాగర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ సొంత రెవెన్యూ మొత్తం ఉద్యోగుల జీతభత్యాలు, పెన్షన్లకే ఖర్చవుతోందని చెప్పడం సరికాదన్నారు. ఉద్యోగుల జీతాల వ్యయం ప్రభుత్వ మొత్తం ఖర్చులో 35 శాతానికి మించదని పేర్కొన్నారు.

నెల్లూరులోని ఎన్జీవో హోమ్‌లో శనివారం ఏపీ ఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీవీ రమణ, ఇతర నాయకులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో విద్యాసాగర్ మాట్లాడారు. ప్రభుత్వాలు ప్రజల ద్వారా ఎన్నికై రాజకీయ అజెండాలో భాగంగా నియామకాలు, నిర్ణయాలు తీసుకుంటాయని, లక్షలాది మందిని నియమించే క్రమంలో సగటు ఉద్యోగి బాధ్యత ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్ణయాల కారణంగా ఉద్యోగులను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేయకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు.

**పీఆర్సీపై ఎనిమిదేళ్లుగా ఎదురుచూపులు**

వేతన సవరణ జరిగి ఇప్పటికే ఎనిమిదేళ్లు దాటిపోయాయని విద్యాసాగర్ తెలిపారు. గత ప్రభుత్వం నియమించిన పీఆర్సీ కమిషన్ రాజీనామా చేసి మూడేళ్లకు పైగా గడిచినా కొత్త కమిషన్‌ను నియమించకపోవడం ఉద్యోగుల్లో నిరాశకు కారణమవుతోందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో వేతన సవరణ, మధ్యంతర భృతి వంటి హామీలు ఇచ్చిందని, వాటిని అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

**పెండింగ్ డీఏలు విడుదల చేయాలి**

ధరల పెరుగుదలకు అనుగుణంగా ఉద్యోగుల కొనుగోలు శక్తిని కాపాడేందుకు ప్రతి ఆరు నెలలకు డీఏ ప్రకటించడం సాధారణ విధానమే కాకుండా న్యాయమైన ఆర్థిక ప్రయోజనమని విద్యాసాగర్ అన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను ఇకపై వాయిదా వేయకుండా తక్షణమే మంజూరు చేయాలని కోరారు. పీఆర్సీ కమిషన్ నియామకం, ఐఆర్ ప్రకటన, పెండింగ్ డీఏల విడుదలలో జాప్యం ఉద్యోగుల్లో అసంతృప్తికి దారితీస్తోందన్నారు.

**ప్రభుత్వ పరిపాలనలో ఉద్యోగులదే కీలక పాత్ర**

రాష్ట్రపరిపాలనను నడిపేది ఉద్యోగులేనని, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో వారి పాత్ర కీలకమని విద్యాసాగర్ తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించడం, కొన్ని బకాయిలను విడుదల చేయడం వంటి చర్యలను స్వాగతిస్తున్నామని, అదే సమయంలో ఉద్యోగులకు న్యాయంగా అందాల్సిన పీఆర్సీ, ఐఆర్, డీఏల విషయంలో జాప్యం ఆందోళన కలిగిస్తోందన్నారు.

**తెలంగాణలో ఐఆర్.. ఏపీలో కమిషన్ కూడా లేదు**

పొరుగు రాష్ట్రం తెలంగాణలో పీఆర్సీ ప్రక్రియ ముందుకు సాగుతూ ఐఆర్ కూడా ప్రకటించిన పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్‌లో పీఆర్సీ కమిషన్ నియామకమే జరగకపోవడం ఉద్యోగుల్లో నిరాశకు కారణమవుతోందన్నారు. అనుభవం కలిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై ఉద్యోగులు నమ్మకం పెట్టుకున్నారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టేలా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

ఏపీ ఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీవీ రమణ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై మంత్రివర్గ ఉపసంఘంతో జరిగిన చర్చలు సానుకూల వాతావరణంలో జరిగాయని తెలిపారు. త్వరలో ముఖ్యమంత్రి సమక్షంలో ఉద్యోగ సంఘాల నాయకులతో జరిగే సమావేశంలో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పీఆర్సీ, ఐఆర్, పెండింగ్ డీఏలపై వెంటనే నిర్ణయం తీసుకోవడంతో పాటు పెన్షనర్ల అడిషనల్ క్వాంటమ్, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల నోషనల్ ఇంక్రిమెంట్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఉద్యోగుల అసంతృప్తి ప్రత్యక్ష కార్యాచరణకు దారితీయకముందే ప్రభుత్వం స్పందించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఏపీ ఎన్జీవో రాష్ట్ర కార్యదర్శి ఎల్. రజనీష్‌బాబు, ఉపాధ్యక్షుడు రవిశంకర్, నెల్లూరు జిల్లా అధ్యక్షుడు బి. వెంకటేశ్వర్లు, కార్యదర్శి జి. రామకృష్ణ, విజయవాడ నగర శాఖ అధ్యక్షుడు సీవీఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారిని దర్శించుకున్న తుంకూర్ ఎస్పి



**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్):** కర్ణాటక రాష్ట్రం తుంకూర్ జిల్లా ఎస్పీగా పని చేయుచున్న కూరాకు వెంకట అశోక్ అదే రాష్ట్రం, అదే జిల్లాలో జిల్లా పరిషత్ సీఈఓ గా పనిచేయుచున్న బివి అశ్విజ ఇరువురు దంపతులు ఆదివారం శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారిని దర్శించుకోవడం జరిగింది.

అశోక్ తండ్రి గారైన కూరాకు వెంకటయ్య(రిటైర్డ్ డి. ఎస్. పి)బ్రహ్మంగారి మఠం మండలం జంగంరాజుపల్లె కు చెందిన వ్యక్తి కావడం మనందరికీ గొప్ప విషయం. ఆయన విద్యాభ్యాసమంతా కూడా బ్రహ్మంగారిమఠంలోనే జరిగిందని ఆయన తెలియజేశారు.

ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ మాట్లాడుతూ శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామిని దర్శించడం నాకెంతో ఆనందంగా ఉందన్నారు. తెలుగు గంగ ప్రాజెక్టులో మునక ప్రాంతమైన జంగం రాజు పల్లె మా స్వగ్రామమని, తాను చిన్నప్పుడు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన సమయంలో ఇక్కడికి వచ్చే వాళ్ళమని, ఇక్కడ తిరిగే వాళ్ళమని ఆయన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేశారు. ఇక్కడికి ప్రాంత వాసిగా ఐపీఎస్ కు సెలెక్ట్ అయ్యి తుంకూర్ జిల్లాలో పనిచేయడం నాకెంతో గర్వంగా ఉందన్నారు.

ఈ సందర్భంగా వీరంతా స్వామి దర్శనం అనంతరం మఠాధిపతులు శ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వామి వారిని మర్యాదపూర్వకంగా కలుసుకోవడం జరిగింది.

మఠాధిపతులు వీరికి ఆశీర్వచనం అందించి, శాలువా కప్పి శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి జీవిత చరిత్రను అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మఠాధిపతి తమ్ముళ్లు వీరం బోట్లయ్య స్వామి, దత్తాత్రేయ స్వామి, స్థానిక ఎస్సై శివప్రసాద్ మండల టిడిపి నాయకులు ఎస్సార్ శ్రీనివాసులరెడ్డి స్థానికులు మాధవ నాయుడు, కూరాకు నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా ఉద్యోగుల కోసం ఎన్జీజీవోస్ అసోసియేషన్ మెడికల్ క్యాంపు



## ○ ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు

**నెల్లూరు(జర్నలిస్ట్ ఫైల్) ::** మహిళా ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా ఏపీ ఎన్జీజీవోస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు దర్గామిట్టలోని అసోసియేషన్ హాల్‌లో ప్రత్యేక మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఏపీ ఎన్జీజీవోస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ జేఏసీ చైర్మన్ అలపర్తి విద్యాసాగర్ శిబిరాన్ని ప్రారంభించారు.

మహిళా ఉద్యోగుల ప్రతినిధులు సామాజిక సేవా భావంతో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో వివిధ వ్యాధుల నివారణకు ఉపయోగపడే మందులు, సిరప్‌లను అందుబాటులో ఉంచారు. మహిళా వైద్యాధికారులు ఉద్యోగులకు అవసరమైన వైద్య సూచనలు అందించారు. శిబిరాన్ని ఏర్పాటు చేసిన మహిళా ప్రతినిధుల బృందాన్ని విద్యాసాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీవీ రమణ అభినందించారు.

ఈ సందర్భంగా విద్యాసాగర్, డీవీ రమణ స్వయంగా బీపీ పరీక్షలు చేయించుకున్నారు. మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో శిబిరానికి హాజరై వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు.

కార్యక్రమంలో ఏపీ ఎన్జీజీవోస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎల్. రజనీష-బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్. రవిశంకర్, కిరణ్‌కుమార్, విజయవాడ సిటీ యూనిట్ అధ్యక్షుడు సీహెచ్‌సీవీఆర్ ప్రసాద్, నెల్లూరు జిల్లా అధ్యక్షుడు పి. వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి జి. రామకృష్ణ, తిరుపతి జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలే నా కుటుంబ సభ్యులు : ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తన కుటుంబమని... అందులోని కార్యకర్తలంతా తన కుటుంబ సభ్యులని శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి వ్యాఖ్యానించారు. తన కుటుంబ సభ్యుల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడడమే తన లక్ష్యమని వెల్లడించారు.

జీర్ణకోశ శస్త్ర చికిత్స చేయించుకుని ముత్యాలరెడ్డినగర్ లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న వైసీపీ కార్యకర్త, అన్నదాన సత్రం మాజీ ఛైర్మన్ పోకల వసంత్ సోదరుడు పోకల బద్రిని శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి ఆదివారం పరామర్శించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ, కార్యకర్తలకు అన్ని విధాలా అండగా నిలవడమే తమ అజెండా అని స్పష్టం చేశారు. పార్టీ స్థాపించిన నాటి నుంచి తమ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ ఎలాగైతే కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారో... తాము కూడా ఆయన అడుగుజాడల్లో నడుస్తూ... దాన్నే తమ ప్రధాన కర్తవ్యంగా మలచుకున్నట్లు చెప్పారు. పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా తమకు కార్యకర్తల సంక్షేమం చాలా ముఖ్యమని ఆయన వివరించారు.

చాలా పార్టీలకు కేవలం ఎన్నికల సమయంలోనే కార్యకర్తలు గుర్తొస్తారని.. తమ పార్టీ అందుకు పూర్తి విరుద్ధమని.. ఆయన తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి నుంచి మాజీ ముఖ్యమంత్రి జగన్ వరకు పార్టీ కార్యకర్తల మంచి చెడులు చూసుకుంటూ ముందుకు సాగడమే ధ్యేయంగా కృషి చేశారని గుర్తు చేశారు.

ఈ క్రమంలోనే వైయస్ జగన్ ఆదేశాల మేరకు తాము ఎప్పటికప్పుడు స్వయంగా కార్యకర్తల ఇళ్ళకు వెళ్ళి వారి క్షేమ సమాచారాలు తెలుసుకోవడమే కాక వారికి అండగా నిలుస్తున్న విషయం అందరికి తెలిసిందేనని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి వ్యాఖ్యానించారు.

ఈ కార్యక్రమంలో పార్టీ సీఈసీ సభ్యులు మందపాటి శేషగిరిరావు, మాజీ కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ ఆచారి (ఆచారి), వంగల వలి వీరారెడ్డి, వంశీ, బోడపాటి కిషోర్, గురవయ్య, గోపి, గేదెల రమేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ బత్తుల దేవానంద్, గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ నూతలపాటి వెంకటేశ్వర్లు, పార్టీ నేతలు భాస్కర్‌రెడ్డి, లంకిరెడ్డి మనోహర్‌రెడ్డి, అంబటి శ్రీనివాసరెడ్డి, కరుణాకరరెడ్డి, పానుగంటి చైతన్య, ఆలా కిరణ్, కొల్లూరు శివప్రసాద్, రెడ్డి కోటేశ్వరరావు, పవన్, ప్రసాద్, సుందరరావు, మురళి, గణేష్, ఉదయ్, మేరీ, జాన్సీ, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## ఘనంగా యూసీమాస్ రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలు





**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** నగరంలోని అమరావతి రోడ్డులోని ఏ కన్వెన్షన్‌లో 10వ యూసీమాస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి అబాకస్, మెంటల్ అర్థమెటిక్ పోటీలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్రంలో యూసీమాస్ విజయవంతంగా పదేళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ పోటీలను నిర్వహించినట్లు శ్రీరైనా టెక్నాలజీస్ ఛైర్మన్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు.
రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 2,000 మందికి పైగా విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. చిన్నారులు తమ ఏకాగ్రత, వేగం, జ్ఞాపకశక్తి, మానసిక గణిత నైపుణ్యాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్. భరణి పురస్కారాలు అందజేసి అభినందించారు.
ఈ సందర్భంగా ఎస్. భరణి మాట్లాడుతూ అబాకస్, మెంటల్ అర్థమెటిక్ వంటి పోటీలు విద్యార్థుల్లో అభ్యాస సామర్థ్యం, జ్ఞాపకశక్తి, ఏకాగ్రతతో పాటు మేధో వికాసాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని అన్నారు. చిన్న వయసులోనే గణితంపై ఆసక్తిని పెంచడంతో పాటు వేగంగా ఆలోచించే సామర్థ్యాన్ని ఇటువంటి కార్యక్రమాలు అభివృద్ధి చేస్తాయని పేర్కొన్నారు.
యూసీమాస్ కోర్సును విజయవంతంగా పూర్తి చేసిన 300 మందికి పైగా విద్యార్థులకు కార్యక్రమంలో గ్రాడ్యుయేషన్ పట్టాలను ప్రదానం చేశారు. పదేళ్లుగా రాష్ట్రంలో యూసీమాస్ ద్వారా వేలాది మంది విద్యార్థులకు మానసిక గణితం, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి అభివృద్ధికి శిక్షణ అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వివా ది స్కూల్ డైరెక్టర్ కె.ఎస్.రావు, యూసీమాస్ సభ్యులు స్నేహల్ కారియా, బాలాజీ రాజగోపాల్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## తిరుపతి జోయాలుక్కాస్‌లో బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో



**తిరుపతి(జర్నలిస్ట్ ఫైల్):** జోయాలుక్కాస్ తిరుపతి షోరూంలో 'బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో' శనివారం ప్రారంభమైంది. ఆగస్టు 23 వరకు జరిగే ఈ ప్రత్యేక ప్రదర్శనలో వజ్రాభరణాల కళాత్మకత, సొగసు, ఆధునిక డిజైన్లను ప్రదర్శించనున్నారు.
వివాహ వేడుకలకు అనువైన ప్రత్యేక సెట్ల నుంచి ఆధునిక జీవనశైలికి సరిపోయే రోజువారీ వజ్రాభరణాల వరకు విభిన్న డిజైన్లు ప్రదర్శనలో అందుబాటులో ఉంటాయి. సంప్రదాయ సౌందర్యాన్ని సమకాలీన డిజైన్లతో మేళవించిన ప్రత్యేక ఆభరణాలు ఈ ప్రదర్శనకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ప్రదర్శన కాలంలో మాత్రమే పరిమితంగా లభించే ప్రత్యేక డిజైన్లను వినియోగదారులు కొనుగోలు చేసే అవకాశం కల్పించారు.
జోయాలుక్కాస్ గ్రూప్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డా. జోయ్ అలుక్కాస్ మాట్లాడుతూ వజ్రాల శాశ్వత సౌందర్యానికి, ఆభరణాల రూపకల్పనలో తమ అభిరుచికి 'బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో' ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ తమ సంస్థ ప్రయాణంలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉందని,
పండుగ సీజన్‌లో నిర్వహిస్తున్న ఈ ప్రదర్శన ద్వారా వినియోగదారులు ప్రత్యేకత, సౌందర్యం, అత్యుత్తమ కళాత్మకతతో కూడిన డిజైన్లను ఎంపిక చేసుకునే అవకాశం పొందుతారని తెలిపారు.
ప్రదర్శనలో భాగంగా రూ. 1 లక్ష లేదా అంతకంటే ఎక్కువ విలువైన వజ్రాభరణాలను కొనుగోలు చేసే వినియోగదారులకు ఉచిత బంగారు నాణెం అందించనున్నట్లు సంస్థ ప్రకటించింది. ఆగస్టు 23 వరకు ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి షోరూంలో మాత్రమే ఈ ప్రత్యేక డైమండ్ జ్యువెలరీ షో నిర్వహించనున్నట్లు వెల్లడించింది.

## ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు చొరవతో 11 మందికి రూ.7.38 లక్షల సీఎంఆర్ఎఫ్ సాయం



**వేమూరు (జర్నలిస్ట్ ఫైల్) :** అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన కొల్లూరు మండలానికి చెందిన 11 మంది బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ. 7,38,845 ఆర్థిక సాయం మంజూరైంది. వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు సిఫార్సు మేరకు సంబంధిత అధికారులు వైద్య ఖర్చుల బిల్లులను పరిశీలించి అర్హులకు సాయం మంజూరు చేశారు.
కొల్లూరు గ్రామానికి చెందిన ఐదుగురికి రూ. 1,78,120, గాజులంకకు చెందిన ఇద్దరికి రూ. 3,74,298, క్రాప గ్రామానికి చెందిన ఒకరికి రూ. 15,800, పెసర్లంకకు చెందిన ఒకరికి రూ. 45,000, దోనేపూడికి చెందిన ఇద్దరికి రూ. 1,25,627 చొప్పున సాయం అందింది. గాజులంకకు చెందిన వెలివల లక్ష్మీ బసవ ప్రసన్నకు రూ. 3,01,642 అత్యధిక మొత్తంగా మంజూరైంది.
మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు లబ్ధిదారులకు, వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఆర్థిక భరోసాగా నిలుస్తోందన్నారు.
వేమూరు నియోజకవర్గంలో అర్హులైన ప్రతి బాధిత కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందేలా కృషి చేస్తామని తెలిపారు.
లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

## విలువలు, దేశసేవే విద్యకు మార్గదర్శకాలు కావాలి : మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు




**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** విద్యను ఒక లక్ష్యంగా, విలువలతో కూడిన సేవా మార్గంగా చూడాలని మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. విద్యార్థులు తమ విద్యా పరిజ్ఞానానికి సంస్కారం, విలువలు, నైతికత, క్రమశిక్షణ, తమ సంస్కృతిపై గౌరవాన్ని జోడించుకోవాలని సూచించారు. విదేశాలకు వెళ్లి విద్యను అభ్యసించి, సంపాదించవచ్చని.. అయితే మాతృభూమికి తిరిగి వచ్చి దేశసేవ చేయాలని అన్నారు. ఆత్మవిశ్వాసం, సంకల్పం, కష్టపడి పనిచేసే తత్వంతో ఎలాంటి సవాళ్లనైనా అధిగమించి సమాజానికి, దేశానికి అర్థవంతమైన సేవ చేయగలరని పేర్కొన్నారు.
అమరావతిలోని అమృత విశ్వవిద్యాపీఠం రెండో స్నాతకోత్సవానికి వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ విద్య, సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, రియల్‌టైమ్ గవర్నెన్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అతిథి గౌరవంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొత్తం 319 మంది విద్యార్థులు పట్టాలు అందుకున్నారు. వీరిలో 280 మంది బీటెక్, 39 మంది ఎంబీఏ విద్యార్థులు ఉన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు పతకాలు, విద్యా పతకాలు, ధ్రువపత్రాలను అందజేశారు. విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, ఆహ్వానిత అతిథులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

**విద్యతో పాటు బాధ్యత**

పట్టాలు అందుకున్న విద్యార్థులను ఉద్దేశించి మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ.. స్నాతకోత్సవం విద్యకు ముగింపు కాదని, కుటుంబం, సమాజం, దేశం పట్ల మరింత పెద్ద బాధ్యతకు ఇది ఆరంభమని అన్నారు. అమృత విశ్వవిద్యాపీఠం విద్యార్థులకు ఆలోచించడం, నాయకత్వం వహించడం మాత్రమే కాకుండా.. కరుణ, నిజాయతీతో సేవ చేయడం కూడా నేర్పుతోందని చెప్పారు.
విద్యార్థులు ఉద్యోగం ఎక్కడ లభిస్తుందనే దానికంటే.. తాము ఏ సమస్యను పరిష్కరించగలమనే దానిపై దృష్టి పెట్టాలని సూచించారు. నూతన ఆవిష్కర్తలు, వ్యాపారవేత్తలు, ఉద్యోగాలను సృష్టించే వారిగా ఎదగాలని ఆకాంక్షించారు. వైఫల్యాన్ని 'నేర్చుకోవడంలో తొలి ప్రయత్నం'గా భావించాలని సూచిస్తూ.. నిజాయతీ, వినయం, పట్టుదలతో అత్యుత్తమ ప్రతిభను సాధించాలని పిలుపునిచ్చారు.

**కరుణతో జ్ఞానాన్ని వినియోగించాలి**

అమృత విశ్వవిద్యాపీఠం కులపతి సద్గురు శ్రీమాత అమృతానందమయి దేవి 'అమ్మ' రికార్డు చేసిన సందేశంలో పట్టభద్రులను ఉద్దేశించి మాట్లాడారు. సమాజం పట్ల బాధ్యత, కరుణతో తమ జ్ఞానాన్ని వినియోగించాలని సూచించారు.
"మీ అవసరాల గురించి మాత్రమే ఆలోచించకుండా.. ప్రపంచాన్ని మెరుగుపర్చేందుకు మీరు ఏం చేయగలరో కూడా ఆలోచించాలి. మీ జీవితం ప్రపంచ సేవకు కూడా అంకితం కావాలి. ప్రేమ అనే నూనెలో తడిసిన కరుణ అనే వత్తిని వెలిగించాలి" అని అమ్మ సందేశంలో పేర్కొన్నారు.

**విద్య, నియామకాలు, పరిశోధనల్లో పురోగతి**

అమరావతి ప్రాంగణం విద్య, ఉద్యోగ నియామకాలు, పరిశోధన రంగాల్లో సాధించిన పురోగతిని రెండో స్నాతకోత్సవం సందర్భంగా వివరించారు.
ఇంజినీరింగ్ విద్యార్థుల నియామకాల్లో ఇప్పటివరకు అత్యధిక వార్షిక వేతన ప్యాకేజీ రూ. 48 లక్షలు కాగా.. సగటు ప్యాకేజీ రూ. 6.8 లక్షలుగా నమోదైంది. అమెజాన్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్, డెలాయిట్, కాగ్నిజెంట్ తదితర సంస్థలు సహా 350కుపైగా సంస్థలు నియామకాల్లో పాల్గొన్నాయి.
ఎంబీఏ విద్యార్థుల నియామకాల్లో అత్యధిక వార్షిక వేతన ప్యాకేజీ రూ. 12 లక్షలు కాగా.. సగటు ప్యాకేజీ రూ. 7.2 లక్షలుగా ఉంది. ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ తదితర సంస్థలు సహా 22కుపైగా సంస్థలు నియామకాల్లో పాల్గొన్నాయి.
ప్రాంగణంలో విద్యార్థుల పరిశోధనలకు సంబంధించి 150 పరిశోధనా ప్రచురణలు, అధ్యాపకుల నుంచి 652 పరిశోధనా ప్రచురణలు వెలువడ్డాయి. 10 పేటెంట్లు నమోదయ్యాయి. బాహ్య సంస్థల నుంచి నిధులు పొందిన అధ్యాపకుల పరిశోధనా ప్రాజెక్టులు కూడా సంస్థ అభివృద్ధికి దోహదపడ్డాయి. ఈ కాలంలో ఇంటర్న్‌షిప్‌లలో విద్యార్థులు 1.6 శాతం మేర అత్యుత్తమ పనితీరు, విజయాలను సాధించినట్లు విశ్వవిద్యాలయం తెలిపింది.
పట్టాలు అందుకున్న విద్యార్థులు ఇక తమ వృత్తిపరమైన ప్రయాణాన్ని ప్రారంభించనున్నారు. విద్యా నైపుణ్యం, నూతన ఆవిష్కరణలు, సామాజిక బాధ్యత, దేశ నిర్మాణం వంటి విశ్వవిద్యాలయ లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లాలని వర్సిటీ ఆకాంక్షించింది.

**అమృత విశ్వవిద్యాపీఠం గురించి**

అమృత విశ్వవిద్యాపీఠం ప్రముఖ బహుళశాఖల పరిశోధన ఆధారిత ప్రైవేటు విశ్వవిద్యాలయం. జాతీయ అంచనా, గుర్తింపు మండలి నుంచి అత్యున్నత ఏ++ గ్రేడ్ గుర్తింపు పొందింది. ప్రపంచవ్యాప్తంగా పేరొందిన మానవతావాది శ్రీమాత అమృతానందమయి దేవి 'అమ్మ' స్థాపించిన ఈ విశ్వవిద్యాలయం 'జీవితానికి విద్య', 'కరుణ ఆధారిత పరిశోధన' అనే ప్రత్యేక లక్ష్యాలతో పనిచేస్తోంది.
అమరావతి, అమృతపురి, బెంగళూరు, చెన్నై, కోయంబత్తూరు, ఢిల్లీ జాతీయ రాజధాని ప్రాంతం (ఫరీదాబాద్), హరిద్వార్, కొచ్చి, మైసూరు, నాగర్‌కోయిల్‌లోని 10 ప్రాంగణాల్లో విశ్వవిద్యాలయం కార్యకలాపాలు నిర్వహిస్తోంది. 19 అనుబంధ పాఠశాలల ద్వారా 2,000 మందికిపైగా అధ్యాపకుల మార్గదర్శకత్వంలో 30,000 మందికిపైగా విద్యార్థులకు విద్య అందిస్తోంది.
ఇంజినీరింగ్, వైద్యం, నిర్వహణ, కంప్యూటింగ్, శాస్త్రాలు, కళలు, మానవీయ శాస్త్రాలు తదితర విభాగాల్లో 300కుపైగా పట్టభద్ర, పీజీ, డాక్టరేట్ కోర్సులను అందిస్తోంది.
ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ విశ్వవిద్యాలయాలతో 180కుపైగా అంతర్జాతీయ భాగస్వామ్యాలను అమృత విశ్వవిద్యాపీఠం ఏర్పాటు చేసుకుంది. జాతీయ సంస్థాగత ర్యాంకింగ్ చట్రం--2025 విశ్వవిద్యాలయాల విభాగంలో 8వ ర్యాంకు, వైద్య విభాగంలో 9వ ర్యాంకు సాధించింది. సామాజిక, సుస్థిర అభివృద్ధికి చేస్తున్న కృషికి గుర్తింపుగా 2026 టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ సస్టైయినబిలిటీ ఇంపాక్ట్ ర్యాంకింగ్స్‌లో ప్రపంచంలోని 40 అత్యుత్తమ సంస్థల్లో స్థానం సంపాదించింది.

# ఉద్యోగులపై ఖర్చుపై తప్పుడు ప్రచారం వద్దు

- ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన మానుకోవాలి
- ఉద్యోగుల బకాయిలు, పీఆర్సీ, ఐఆర్‌పై వెంటనే నిర్ణయాలు తీసుకోవాలి: ఏపీ జేఏసీ అమరావతి




**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై చర్చల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేయడం మానుకోవాలని, కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏపీ జేఏసీ అమరావతి డిమాండ్ చేసింది. ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు, పీఆర్సీ కమిషనర్ నియామకం, మధ్యంతర భృతి (ఐఆర్), పెండింగ్ డీఏలు తదితర అంశాలపై ప్రభుత్వం వెంటనే స్పష్టమైన నిర్ణయాలు ప్రకటించాలని కోరింది. విజయవాడ రెవెన్యూ భవన్‌లో శనివారం ఏపీ జేఏసీ అమరావతి ఉద్యమ కార్యాచరణ కమిటీ సమావేశం జరిగింది. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జేఏసీ ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, ఉద్యమ కమిటీ ఛైర్మన్ టీవీ ఫణి పేర్రాజు, కోశాధికారి తిమ్మసర్తి నాగేశ్వరరావు, మహిళా విభాగం ఛైర్‌పర్సన్ పి. లక్ష్మి, సెక్రటరీ జనరల్ పొన్నూరు విజయలక్ష్మి తదితరులు మాట్లాడారు.
**చర్చలు జరిగినా నిర్ణయాలు లేవు :** ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ కార్యాచరణ ప్రారంభించిన సమయంలో ప్రభుత్వం చర్చలకు పిలవడం సానుకూల పరిణామంగా భావించామని, అయితే జూలై 22న మంత్రివర్గ ఉపసంఘంతో సుదీర్ఘంగా చర్చలు జరిగినప్పటికీ ఇప్పటివరకు ఒక్క నిర్ణయం కూడా ప్రకటించలేదని జేఏసీ నాయకులు తెలిపారు. ఉద్యోగులు కొత్త డిమాండ్లు కోరడం లేదని, కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలనే అమలు చేయాలని కోరుతున్నామని స్పష్టం చేశారు.

**ఉద్యోగులపై ఖర్చుపై తప్పుడు ప్రచారం వద్దు**

ఆగస్టు 4న ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రంలో ఉద్యోగులపై చేస్తున్న వ్యయాన్ని ప్రజలను తప్పుదోవ పట్టించేలా చూపడం సరికాదని అన్నారు. కాగ్ గణాంకాల ప్రకారం 2025--26లో మొత్తం రెవెన్యూ వ్యయంలో ఉద్యోగులు, పెన్షనర్లకు చెల్లించే వ్యయం 37.41 శాతం మాత్రమేనని తెలిపారు. స్టేట్ ట్యాక్స్ రెవెన్యూలో ఉద్యోగులు, పెన్షనర్లకు అయ్యే ఖర్చు 59.36 శాతం, మొత్తం రెవెన్యూ ఆదాయంలో 47.64 శాతం మాత్రమేనని పేర్కొన్నారు. మొత్తం ఖర్చులో ఉద్యోగులపై చేస్తున్న వ్యయం ఎంత శాతమో స్పష్టంగా వెల్లడించకుండా రాష్ట్ర ఆదాయం అంతా ఉద్యోగులకే వెళ్తున్నట్లు ప్రచారం చేయడం బాధాకరమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేసిన చెల్లింపుల్లో ఎక్కువ భాగం రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించిన జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, మెడికల్ రీయింబర్స్‌మెంట్ తదితర ఉద్యోగులు తమ సర్వీసులో దాచుకున్న మొత్తాలేనని జేఏసీ నాయకులు తెలిపారు. ఉద్యోగులు దాచుకున్న మొత్తాలను రిటైర్మెంట్ అనంతరం చెల్లించడం ప్రభుత్వ బాధ్యతేనన్నారు. రెండేళ్లుగా గ్రాట్యుటీ సహా పలు ప్రయోజనాలు అందక రిటైర్డ్ ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

**రానున్న రోజుల్లో జీతాల భారం తగ్గుతుంది**

2024 నుంచి 2026 వరకు 41,321 మంది ఉద్యోగులు పదవీ విరమణ చేశారని బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. 2024లో 13,643 మంది, 2025లో 13,583 మంది, 2026లో 14,095 మంది రిటైర్ అయ్యారని చెప్పారు. రానున్న ఐదేళ్లలో సుమారు 1,51,755 మంది పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో ప్రభుత్వంపై జీతభత్యాల వ్యయం గణనీయంగా తగ్గుతుందని అన్నారు.

**పీఆర్సీ కమిషనర్ నియామకం చేయాలి**

వెంటనే పీఆర్సీ కమిషనర్‌ను నియమించి ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను విడుదల చేయాలని జేఏసీ డిమాండ్ చేసింది. ఉద్యోగులకు రావాల్సిన పాత బకాయిలు ఎంత, ఎప్పుడు చెల్లిస్తారో స్పష్టంగా ప్రకటించి పే స్లిప్‌లలో పొందుపరచాలని కోరింది. సీపీఎస్, జీపీఎస్ విధానాలను పునఃసమీక్షించి ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపాలని, పెన్షనర్లకు అదనపు క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ పునరుద్ధరించాలని, పెన్షన్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది.
కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు జేఏసీ ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన 29 అంశాల్లో ప్రధానమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరింది. ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయాలు తీసుకోకపోతే ఆగస్టు 15 తర్వాత కలిసి వచ్చే సంఘాలతో ఐక్య కార్యాచరణ చేపడతామని హెచ్చరించింది.
ఈ సమావేశంలో హెడ్‌మాస్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెవ్వూరి రవి, ఏపీ క్లాస్‌ఫోర్ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. మల్లేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుమార్‌రెడ్డి, జిల్లాల జేఏసీ నాయకులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పీఆర్సీ కమిటీ, ఐఆర్ వెంటనే ప్రకటించాలి: ఆప్టా

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** ఉద్యోగులు, ఉపాధ్యాయుల్లో పెరుగుతున్న అసంతృప్తిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పీఆర్సీ కమిటీ, మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) రాష్ట్ర అధ్యక్షుడు కాకి ప్రకాష్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎం.జి. మెహదీ డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవ తీసుకుని ఈ విషయంలో తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.
కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఉపాధ్యాయులు, ఉద్యోగులకు స్నేహపూర్వక ప్రభుత్వంగా ఉంటామని హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత రెండేళ్లుగా కాలయాపన చేయడం సరికాదన్నారు. ప్రస్తుతం శ్వేతపత్రం పేరుతో ఉద్యోగుల జీతభత్యాలపై ప్రభుత్వం చేస్తున్న వ్యయాన్ని ప్రస్తావిస్తూ గత ప్రభుత్వ ధోరణిలోనే మాట్లాడటం బాధాకరమని విమర్శించారు. పీఆర్సీ కమిటీ, ఐఆర్ ప్రకటన విషయంలో ఇక ఆలస్యం చేయరాదని స్పష్టం చేశారు.
ఉపాధ్యాయులు, ఉద్యోగుల్లో అసంతృప్తి పెరుగుతోందని, అది రోడ్డెక్కక ముందే ప్రభుత్వం స్పందించాలని వారు కోరారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, మంత్రుల బృందంతో చర్చల పేరుతో మరింత కాలయాపన చేయడం తగదన్నారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయులు, ఉద్యోగులు ప్రతి పరిణామాన్ని నిశితంగా గమనిస్తున్నారని పేర్కొన్నారు.
నాలుగేళ్లుగా సరెండర్ లీవ్ బిల్లులు పెండింగ్
ఉద్యోగులకు చెల్లించాల్సిన సరెండర్ లీవ్ బిల్లులు 2022 నుంచి పెండింగ్‌లో ఉన్నాయని ఆప్టా నేతలు తెలిపారు. నాలుగేళ్లుగా బిల్లుల కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్, పీఎఫ్ బిల్లులు కూడా పెద్ద సంఖ్యలో పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరారు.
ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలని, పీఆర్సీ కమిటీ, ఐఆర్ ప్రకటనతో పాటు పెండింగ్ బిల్లుల చెల్లింపులకు చర్యలు చేపట్టాలని కాకి ప్రకాష్‌రావు, ఎం.జి. మెహదీ డిమాండ్ చేశారు.

## తిరంగా మన గౌరవం.. దేశభక్తికి ప్రతీక...ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి : పెమ్మసాని





**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** జాతీయ జెండా ప్రతి భారతీయుడి ఆత్మగౌరవానికి, దేశభక్తికి, జాతీయ ఐక్యతకు ప్రతీక అని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరులో నిర్వహించిన తిరంగా ర్యాలీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.
విజ్ఞాన్ మందిరం నుంచి ప్రారంభమైన 200 మీటర్ల జాతీయ జెండా శోభాయాత్ర మార్కెట్ సెంటర్, లిబర్టీ, కృష్ణమహల్ థియేటర్ రోడ్డు మీదుగా నాజ్ సెంటర్ వరకు సాగింది. 'భారత్ మాతాకీ జై', 'వందేమాతరం' నినాదాలతో ర్యాలీ ఉత్సాహంగా సాగింది.

**స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలి**

ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ తిరంగా కేవలం జెండా మాత్రమే కాదని, స్వాతంత్ర్య పోరాటానికి, సైనికుల త్యాగాలకు, 140 కోట్ల మంది భారతీయుల ఐక్యతకు ప్రతీక అని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు చేసిన త్యాగాలను స్మరించుకుంటూ జాతీయ జెండాను గౌరవించడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు.
దేశంలో జాతీయ భావన, దేశభక్తి, ఐక్యతా స్ఫూర్తిని మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధితో పాటు దేశభక్తి, జాతీయ సమైక్యత, సామాజిక బాధ్యతను ప్రతి పౌరుడు జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

**యువత జాతీయ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి**

యువత దేశానికి వెన్నెముక అని పెమ్మసాని అన్నారు. స్వాతంత్ర్యం కోసం అమరులైన మహనీయుల జీవిత చరిత్రలను యువత తెలుసుకుని, వారి త్యాగాల స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించాలని సూచించారు. యువత పెద్ద సంఖ్యలో జాతీయ కార్యక్రమాల్లో పాల్గొని దేశం పట్ల తమ బాధ్యతను చాటుకోవాలని కోరారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి 'హర్ ఘర్ తిరంగా--హర్ దిల్ తిరంగా' స్ఫూర్తిని చాటాలని పిలుపునిచ్చారు.
**ప్రతి గుండెలో దేశభక్తి వెలగాలి:** రాజ్యసభ సభ్యుడు భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ తిరంగా భారతదేశ ఆత్మగౌరవానికి ప్రతీక అన్నారు. జాతీయ జెండా కోసం లక్షలాది మంది స్వాతంత్ర్య సమరయోధులు ప్రాణత్యాగం చేశారని గుర్తుచేశారు.
ప్రతి ఇంటిపై తిరంగా ఎగరాలని, ప్రతి గుండెలో దేశభక్తి వెలగాలని అన్నారు. 'హర్ ఘర్ తిరంగా'ను ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ప్రతి పౌరుడి జాతీయ బాధ్యతగా స్వీకరించాలని సూచించారు. భాషలు, ప్రాంతాలు, సంప్రదాయాలు వేరైనా జాతీయ పతాకం అందరినీ ఏకం చేస్తుందని పేర్కొన్నారు.

**దేశ నిర్మాణంలో యువత ముందుండాలి**

తూర్పు ఎమ్మెల్యే నజీర్ మహమ్మద్ మాట్లాడుతూ యువత చేతిలో జాతీయ పతాకం ఉంటే దేశ భవిష్యత్తు భద్రంగా ఉంటుందన్నారు. సోషల్ మీడియాలో దేశభక్తి సందేశాలను పంచుకోవడంతో పాటు సమాజ సేవ, పర్యావరణ పరిరక్షణ, విద్యా ప్రోత్సాహం, అవినీతి వ్యతిరేక కార్యక్రమాల్లో యువత ముందుండాలని కోరారు.
పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ దేశాన్ని విమర్శించడం సులభమని, దేశాన్ని నిర్మించడం కష్టమని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను నిజాయితీగా నిర్వర్తించినప్పుడే నిజమైన దేశభక్తి నిరూపితమవుతుందని చెప్పారు. ఇల్లు శుభ్రంగా ఉంచడం నుంచి ప్రజా ఆస్తులను పరిరక్షించడం వరకు ప్రతి మంచి పని దేశసేవేనని పేర్కొన్నారు.

**భారీగా పాల్గొన్న ఎన్డీఏ శ్రేణులు**

ర్యాలీలో ఇండస్ట్రియల్ కార్పొరేషన్ ఛైర్మన్ డేగల ప్రభాకర్, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, మాజీ డిప్యూటీ మేయర్ షేక్ సజీల, రాష్ట్ర తిరంగా ర్యాలీ కన్వీనర్ గుడిసె దేవానంద్, కో-కన్వీనర్లు శివారెడ్డి, సాయి లోకేష్, డాక్టర్ మండూరి వెంకట రమణ, బిట్ర శివన్నారాయణ, కొత్తూరు వెంకట సుబ్బారావు, ఈదర శ్రీనివాసరెడ్డి, వెలగలేటి గంగాధర్, పాలపాటి రవికుమార్, ఆవుల నాగేంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.
జిల్లా తిరంగా యాత్ర కన్వీనర్ డాక్టర్ చరక కుమార్ గౌడ్, కో-కన్వీనర్లు క్రిష్టిపాటి నారాయణరెడ్డి, మేడూరి యశ్వంత్‌తో పాటు ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467